తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-17- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 170 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్‌కి గర్వకారణం రామోజీ గ్రూపు సంస్థలు

## సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,నవంబర్16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి రామోజీ గ్రూపు సంస్థలు గర్వకారణంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చార్మినార్, గోల్కొండ, హైటెక్ సిటీ తరువాయి నాల్గవ అద్భుతంగా రామోజీ ఫిల్మ్ సిటీ గుర్తింపు తెచ్చుకుందని పేర్కొన్నారు.రామోజీ రావు జయంతి సందర్భంగా రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

మిగతా 2లో






# మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- చేపల ఉత్పత్తి లో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా చర్యలు.
- స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో చేప పిల్లలు, రొయ్యల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అబివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**హన్మకొండ,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** మత్స్యకారుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పశు సంవర్ధక, మత్స్య, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్‌లో చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో 12 లక్షల చేప పిల్లల ను విడుదల చేసిన కార్యక్రమానికి స్టేషన్ ఘన్‌పూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్, ముదిరాజ్ సహకార సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, రాష్ట్ర క్రీడల ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, మత్స్యశాఖ సంచాలకులు నిఖిల, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తదితరులు హాజరయ్యారు.

మిగతా 2లో

# గ్లోబల్ సమ్మిట్‌కు వేదికలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి

## తెలంగాణ విజయాలు,భవిష్యత్ దిశ ప్రపంచానికి పరిచయం చేయనున్న ప్రభుత్వం

**హైదరాబాద్,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు అనువైన వేదికలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, గచ్చిబౌలి స్టేడియం, హెచ్ఐసీసీ, హైటెక్స్, దుండిగల్ వంటి ప్రాంతాల్లో సమ్మిట్ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, విస్తీర్ణాలను పరిశీలించడం జరిగింది. ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సమ్మిట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో సాధించిన విజయాలు, రాబోయే “2047 తెలంగాణ రైజింగ్” విజన్ డాక్యుమెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ సమ్మిట్ వేదిక కానుంది.

మిగతా 2లో





# ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్16 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ పర్యటనకు వచ్చిన భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు బేగంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**గవర్నర్ ఇచ్చిన తేనీటి విందులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ గౌరవార్థం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఏర్పాటు చేసిన తేనీటి విందులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతిని ముఖ్యమంత్రి సత్కరించారు. ఈ విందు కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ ఆశీస్సులు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఫలితమే సాక్ష్యం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఇల్లందు,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితం ప్రజా ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ ఆశీస్సులు ఉన్నాయని తేటతెల్లం చేస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్లతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిజాయితీతో అమలు చేస్తున్నందుకు ప్రజల మన్ననలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.

ఇల్లందు నియోజకవర్గ పర్యటనలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో కలిసి ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇల్లందు మండల



కేంద్రంలో గిరిజన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అలాగే సుమారు మూడు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో

# గట్టమ్మ దేవాలయ దర్శనం మరింత సౌకర్యవంతం

- గట్టమ్మ గుట్ట వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన
- మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)

**ములుగు,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** ములుగు జిల్లా సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి ద్వారా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యంగా సేదతీరే అవకాశం లభిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. తల్లిని దర్శించుకోకుండా భక్తులు ముందుకు సాగరానని,

మిగతా 2లో





# రేవంత్ మంత్రివర్గంలోకి నవీన్ యాదవ్..!?

- హైకమాండ్ గ్రీన్ సిగ్నల్...!!
- నేడు మంత్రివర్గం భేటీ
- స్థానికంపై రేవంత్ సర్కార్ ఫోకస్
- డిసెంబర్లోనే ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు
- గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల పైన సర్కార్ కసరత్తు
- సీఎం రేవంత్ వ్యూహాత్మక అడుగులు

**హైదరాబాద్,నవంబర్16 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుచుకున్న నవీన్ యాదవ్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై రేవంత్ సర్కార్ సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీనికి హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది.

మిగతా 2లో

# మీడియా సేవలకు మంత్రి అభినందనలు

- జర్నలిస్టుల కుటుంబ సమ్మేళనంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- సామాజిక బాధ్యతను గుర్తుచేసిన సందేశం
- జర్నలిస్టులతో కలిసి ప్రజాసేవకు కొత్త ప్రతిజ్ఞ

**హైదరాబాద్, 16 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్టు ఫ్యామిలీస్ గెట్ టు గెదర్ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్‌కి గర్వకారణం రామోజీ గ్రూపు సంస్థలు

(మొదటి పేజీ తరువాయి)

పత్రికా రంగం నుంచి సినిమాల వరకు పలు రంగాల్లో రామోజీ రావు చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయను ప్రోత్సహించిన రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని గుర్తించి అవార్డులు అందజేయడం అభినందనీయమని చెప్పారు.

ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగం నంది అవార్డుల నుండి ఆస్కార్ స్థాయికి ఎదగడంలో రామోజీ ఫిల్మ్ సిటీ కీలక పాత్ర పోషించిందని అన్నారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాకుండా హాలీవుడ్ స్థాయి సినిమా నిర్మాణానికి కూడా అనువైన మౌలిక వసతులన్నీ ఫిల్మ్ సిటీ కల్పిస్తోందని తెలిపారు. రామోజీ రావు ఏ రంగంలో పనిచేసినా తనదైన ముద్ర వేసారని, ఆయన పేరు కాదని ఒక బ్రాండ్ అని, ఆ బ్రాండ్‌ను నిలబెట్టేందుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని విశదీకరించారు. తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టిందని, పరిపాలనను తెలుగు భాషలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష కృషి చేసిన ఏడుగురు ప్రముఖులకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు. జర్నలిస్టు జైదీప్ హర్దీకర్, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న పల్లబి ఘోష్, పర్యావరణవేత్త అమలా అశోక్ రూయా, సామాజిక విద్యావేత్త ఆకాశ్ టాండన్, ఆదివాసీ భాషల పరిరక్షణలో కృషి చేసిన సత్తుపతి ప్రసన్నశ్రీ, ప్రముఖ శాస్త్రవేత్త మధవీ లత, పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లాలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామోజీ గ్రూపు చైర్మన్ కిరణ్, మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ విజయేశ్వరి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



# గ్లోబల్ సమ్మిట్‌కు వేదికలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి

(మొదటి పేజీ తరువాయి)

దుబాయ్ ఫెస్టివల్‌ను మించే స్థాయిలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు విస్తృతంగా పాల్గొనేలా సమ్మిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత అనుకూల నగరమని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పే కార్యక్రమంగా ఇది ఉండనుంది. ఈ భారీ ఈవెంట్ నిర్వహణకు సుమారు 100 ఎకరాల ఓపెన్ స్పేస్ అవసరం కాగా, అనువైన ప్రదేశాల ఎంపిక కోసం పలు ప్రాంతాలు పరిశీలించబడ్డాయి. డిసెంబర్ 8, 9 తేదీలు రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక రోజులు కావనున్నాయని అధికారులు తెలిపారు.

# మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చెరువులలో చేపల పెంపకాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సంవత్సరానికి రాష్ట్రంలోని 26 వేల చెరువుల్లో 84 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను వదిలే కార్యక్రమానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా ఉండేలా చెరువుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర మత్స్య పరిశ్రమను విస్తరించేందుకు 123 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో చేప పిల్లలు, రొయ్యల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

రాష్ట్రంలో మత్స్య పరిశ్రమపై ఆధారపడిన లక్షలాది కుటుంబాల ఆర్థిక పురోగతి కోసం చేపల ఉత్పత్తి కేంద్రాలను పెంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యాధునిక సదుపాయాలతో చేపల మార్కెట్లు ఏర్పాటు చేయడానికి పథకాలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల కోసం ప్రభుత్వం కోటి నలభై లక్షల రూపాయల బీమాను చెల్లించిందని తెలిపారు. మత్స్యకారులకు చేపల విక్రయానికి అవసరమైన మొబైల్ వాహనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ....

ధర్మసాగర్ రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల కార్యక్రమం ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. సాగునీటిపారుదల శాఖ అధికారులు తూముల వద్ద ఐరన్ గ్రిల్లులు ఏర్పాటు చేయకపోవడంతో చిన్న చేప పిల్లలు కొట్టుకుపోతున్నాయని, దీనివల్ల దిగుబడి తగ్గుతోందని చెప్పారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం అర్హతలను చెరువు విస్తీర్ణాన్ని ఆధారంగా నిర్ణయించి అందించాలని సూచించారు. సభ్యులకు ప్రమాదవశాత్తు మరణించినప్పుడు ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేశియా అందిస్తున్నట్లు తెలిపారు.

**రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయి కుమార్ మాట్లాడుతూ...**

మత్స్యకారులు, ముదిరాజ్, గంగపుత్ర కుటుంబాల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించడం అపూర్వమన్నారు. సంచాలకులు నిఖిల మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా చేప పిల్లల విడుదలకు 122 కోట్ల రూపాయల వ్యయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చేప పిల్లలను చెరువుల్లో వదిలే సమయంలో సభ్యులు సంఖ్య, సైజు పరిశీలించాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ .....**

జిల్లాలో 830 చెరువుల్లో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని మొదలుపెట్టామని తెలిపారు. గతంలో ధర్మసాగర్ రిజర్వాయర్‌లో 6 లక్షల చేప పిల్లలను వదిలి 250 టన్నుల దిగుబడి సాధించారని, మత్స్యకారులు 25 నుండి 30 లక్షల వరకు ఆదాయం పొందారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు శ్రీనివాస్, డీడీ హనుమంతరావు, జిల్లా మత్స్య అధికారి శ్రీపతి, చీఫ్ ప్రొమోటర్ మల్లేశం, సోమయ్య, తహశీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, మత్స్య సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ ఆశీస్సులు ,జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఫలితమే సాక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సత్యనారాయణపురం, నెం. 2 బస్తీ, ఎన్జీవోప్ కాలనీ, ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రాంతాల్లో వంతెనలు, సిమెంట్ రహదారులు, జంక్షన్ అభివృద్ధి వంటి పనులకు శ్రీకారం చుట్టారు. ఇల్లందు సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

**ప్రభుత్వ ఆసుపత్రి సేవలు భేష్**

ఇల్లందు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి వైద్య సిబ్బందిని ప్రశంసించారు.

ఆసుపత్రి సేవలు మెరుగ్గా ఉన్నాయని అభిప్రాయపడ్డ ఆయన ఐటీడీఏ పీవో రాహుల్‌ను ఆసుపత్రి మౌలిక వసతుల విస్తరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐసీయూ, ఆపరేషన్ గది, వెయిటింగ్ హాల్ షెడ్ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని సూచించారు. అవసరమైన అంబులెన్స్‌ను మంజూరు చేయాలన్నారు. ఈ పనుల పురోగతి 15 రోజుల్లో స్పష్టంగా కనిపించాలన్నారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి పనులు త్వరలో పూర్తవుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్ రాజు, ఆర్‌డీవో మధు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గట్టమ్మ దేవాలయ దర్శనం మరింత సౌకర్యవంతం

(మొదటి పేజీ తరువాయి)

అందుకు అనుగుణంగా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం వద్ద 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు కలెక్టర్ దివాకర్ టి.ఎస్., గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. గట్టమ్మ దేవాలయం జాతీయ రహదారి పక్కన ఉండటంతో, భక్తులు మరియు పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జికి అవసరమైనవి 45 లక్షలు సరిపోని పక్షంలో అదనపు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ మంత్రివర్గంలోకి నవీన్ యాదవ్..!?

(మొదటి పేజీ తరువాయి)

(ఈ నెల 17న)నేడు జరగనున్న మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయాలు వెలువడనున్నాయి.

ఉపఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు, ఆపై గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై దృష్టి సారించింది. సామాజిక సమీకరణాలు, గ్రేటర్ పరిధిలో బలాబలాలు వంటి అంశాలను పరిశీలిస్తూ మంత్రివర్గంలో మార్పులు చేయడానికి సీఎం రేవంత్ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

డిసెంబరు నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేసే దిశగా ప్రభుత్వం వ్యూహాలు సిద్ధం చేస్తోంది. అనంతరం జరగనున్న గ్రేటర్ ఎన్నికలు రేవంత్ నాయకత్వానికి కీలక పరీక్షగా భావిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన కాంగ్రెస్, ఆపై కంటోన్మెంట్ మరియు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించడం పునర్వైభవానికి సూచికగా పార్టీ భావిస్తోంది.



ఖాళీగా ఉన్న రెండు మంత్రివర్గ స్థానాల్లో ఒకదాన్ని నవీన్ యాదవ్‌కు కేటాయించే ఆలోచనలో రేవంత్ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీసీ సమీకరణాలు, గ్రేటర్‌లో యాదవ వర్గం ఓటు బ్యాంక్, ఎంఐఎంతో ఉన్న అనుకూలత వంటి అంశాలు నవీన్‌కు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తలసాని గ్రేటర్ నుంచి మంత్రిగా పనిచేసిన దృష్ట్యా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా గ్రేటర్‌కు మంత్రిపదవి ఇవ్వాలనే వ్యూహం రూపొందిస్తోంది.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో రేవంత్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన హైకమాండ్, నవీన్ యాదవ్‌ను మంత్రి పదవికి సూచించిన ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలపనున్నట్టు సమాచారం. దీంతో, త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.




# మీడియా సేవలకు మంత్రి అభినందనలు

(మొదటి పేజీ తరువాయి)

వార్తా ప్రతినిధుల కుటుంబాలతో కలిసి సన్నిహితంగా గడపడం పట్ల తనకు ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

మీడియా ప్రతినిధులు ప్రతిరోజూ సామాజిక సమస్యలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకువస్తూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టుల వెనుక నిలబడే కుటుంబ సభ్యుల సహకారాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

జర్నలిస్టుల కృషిని గౌరవిస్తూ, వారి పట్ల కృతజ్ఞత వ్యక్తం చేసిన మంత్రి, భవిష్యత్తులో వారితో కలిసి మరిన్ని ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పబద్ధత వ్యక్తం చేశారు. సమాజంలో అవగాహన పెంపొందించడంలో మీడియా కీలక పాత్రను కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జర్నలిస్టుల కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో వేదికను అలరించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రెస్ క్లబ్ నిర్వాహకులను మంత్రి అభినందించారు.





## ఢిల్లీకి ఎల్కతుర్తి ఎమ్మార్పీఎస్ నాయకుల పయనం

**ఎల్కతుర్తి నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దానికి నిరసనగా న్యూఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా సోమవారం జరగనున్న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనలో పాల్గొనడానికి ఎల్కతుర్తి ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు.

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అడ్డూరి అనిల్ మాదిగ, కోకన్వీనర్ బొంకూరి కార్తీక్ మాదిగ కాజీపేట రైల్వే స్టేషన్ నుండి కార్యకర్తల బృందంతో కలిసి ప్రయాణం ప్రారంభించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "ఉన్నత పదవులు, ఉన్నత స్థానాలు పొందినా సైతం కులవ్యతిరేక ధోరణులు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి దళితుల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసింది" అని అన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోరుతూ, దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలకు తమ మద్దతు తెలుపుతూ ఢిల్లీ ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

ఢిల్లీకి బయలుదేరిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలుముల రమేష్ మాదిగ, అడ్డూరి నవీన్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ, ప్రశాంత్ మాదిగ, గాంగరపు రాజు మాదిగ, మైస ప్రశాంత్ మాదిగ, శనిగరపు వంశీ మాదిగ, బొంకూరి రాజేష్ మాదిగ, క్రాంతి మాదిగ తదితరులు ఉన్నారు.



## అంతర్రాష్ట్ర షోటోకాన్ కరాటే ఛాంపియన్‌షిప్ – 2025


**◆ఎల్కతుర్తి అమ్మాయిలకు ప్రతిష్ఠాత్మక బ్లాక్ బెల్ట్‌లు**

**ఎల్కతుర్తి, నవంబర్ 16( తెలంగాణ ముచ్చట్లు) :** జెకెఏఐ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లో నిర్వహించిన అంతర్రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్-2025లో ఎల్కతుర్తి మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు సత్తా చాటారు. తాటికొండ అర్చన, రాంపల్లి అర్చన, కాత్యాయిని ప్రతిష్ఠాత్మక బ్లాక్ బెల్ట్‌లు సాధించి తమ ప్రతిభను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కరాటే కోచ్ కవ్వంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, "నేటి అమ్మాయిలు క్రమశిక్షణ, ఆత్మరక్షణ వంటి నైపుణ్యాలలో ముందంజ వేయేలా తల్లిదండ్రులు ప్రోత్సహించడం అవసరం. సరైన మార్గదర్శకత్వం అందితే పిల్లలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరు. ఈ అమ్మాయిల బ్లాక్ బెల్ట్ సాధన వారి కష్టానికి నిదర్శనం" అన్నారు.

విద్యార్థినులు బ్లాక్ బెల్ట్‌లు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఎల్కతుర్తి ప్రాంతానికి చెందిన అమ్మాయిలు అంతర్రాష్ట్ర వేదికపై రాణించడం స్థానిక ప్రజల్లో గర్వాన్ని నింపింది.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన సద్దాం హుస్సేన్

**వేలేరు,19నవంబర్(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు గ్రామానికి చెందిన చీల సందీప్ రెడ్డి-పవిత్ర దంపతుల వివాహ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు హాజరైన గ్రామ మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సద్దాం హుస్సేన్ నూతన వధూవరులను ఆశీర్వదించి,వారికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మిత్రులు, బంధువులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# కీసరగుట్టలో శ్రీ గౌరి గవర సేవా సంఘం కార్తీక వనభోజనం సందడి

**◆ బీసీ హోదా పునరుద్ధరణ కోసం ఐక్యత అవసరం – నాయకుల పిలుపు**

**కీసర, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** కీసరగుట్టలో శ్రీ గౌరి గవర సేవా సంఘం తిరుమలగిరి-హైదరాబాద్) ఆధ్వర్యంలో 35వ కార్తీక వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. జంట నగరాలు, భద్రాచలం, నాగార్జునసాగర్, అనకాపల్లి, విశాఖపట్నం వంటి ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 2 వేల మంది గవరలు పాల్గొని వేదికను సందడిగా మార్చారు. పాటలు, వినోద ఆటలు, కోలాటం, నృత్యాలు, తాడు లాగుడు వంటి సాంప్రదాయ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గవరల ఐక్యత, సాంప్రదాయం, సమాజ అభివృద్ధి కోసం సంఘం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.గవరల బీసీ హోదా తొలగింపుపై నల్ల సురేంద్ర, మల్ల తులసి రాంబాబు, దర్శకుడు కంద్రేగుల ప్రవీణ్ మాట్లాడారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ హోదా తొలగించడం తీవ్ర అన్యాయం అని పేర్కొన్న వారు, గవరలను తెలంగాణ బీసీ జాబితాలో తిరిగి చేర్చే ఉద్యమంలో సమాజం ఏకతాటిపై నిలవాలని పిలుపునిచ్చారు.సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు పురోగతి వివరాలను రిటైర్డ్ ఐజీ కె. వెంకటేశ్వరరావు పాల్గొన్న వారికి తెలియజేశారు. న్యాయపరమైన అంశాలపై స్పష్టతనిచ్చారు.గవరల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని పీల గోవింద సత్యనారాయణ హామీ ఇచ్చారు. గవరలకు న్యాయపరమైన, రాజకీయపరమైన పూర్తి మద్దతు అందిస్తానని స్పష్టం చేశారు.





# క్రీడల్లో గెలుపు-ఓటములు సహజం, రెండింటినీ సమానంగా తీసుకోవాలి

**◆ డాక్టర్ జిల్లెల్ చిన్నారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**

**వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు-):** చిట్యాల మహాత్మ జ్యోతిబాపూలే సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అండర్ 14, అండర్ 17 క్రీడా మీట్ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల చేత గౌరవ వందనం స్వీకరించారు.

చిన్నారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపుఓటములు సహజం అని, రెండింటినీ సమానంగా స్వీకరించి కష్టపడి, మరింత శ్రమించాలి అని విద్యార్థులకు సూచించారు. వనపర్తి నియోజకవర్గం విద్యా మాత్రమే కాకుండా క్రీడలకు ప్రత్యేక ప్రాముఖ్యత కలిగిన నియోజకవర్గం అని కూడా తెలిపారు. అవసరమైన వసతులు కల్పించడం ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని సూచించారు. క్రీడాకారులు దృఢంగా, శక్తివంతంగా ఉండటానికి పౌష్టికాహారం చాలా ముఖ్యమని, రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచి వారికి సహకరించిందని కూడా అన్నారు.

ఈ సందర్భంగా చిన్నారి రుద్రాణి కూచిపూడి నృత్యం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డాక్టర్ చిన్నారెడ్డి, నృత్యాన్ని ఆన్లైన్‌లో నేర్చుకొని ఎంతో చక్కగా చేసింది అని ప్రశంసించారు. భవిష్యత్తులో మంచి కూచిపూడి కళాకారుణి కావాలని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, ఎంట్ల రవి, మరియు క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# కరాటే క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది

**◆ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** సరూర్‌నగర్‌లో కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోఖాన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ ఛాంపియన్షిప్-2025 ప్రెసిడెంట్ కప్ ముగింపు వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. క్రీడలను తెలంగాణలో మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. కరాటే పోటీలు ఎక్కడ నిర్వహించినా ప్రభుత్వ పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. కరాటే తన జీవితంలో ప్రత్యేక స్థానముందని, ఈ క్రీడలో కొనసాగించడానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. క్రీడల




పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విశేష ఆసక్తి ఉందని తెలిపారు. ఫుట్బాల్ స్టార్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారని, ఆయన సందర్శనకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉండే అవకాశాలు ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమురయ్య, హెచ్‌ఎఫ్ఎస్ అధ్యక్షుడు గడియారం గణేష్, పి. రామకృష్ణ, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరొక కార్యక్రమంలో గచ్చిబౌలిలో నిర్వహించిన ఎన్ఎస్ఎన్ కరాటే లీగ్-2025కు కూడా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో కరాటే మాస్ గేమ్‌గా ఎదుగుతున్నదని, ఈ క్రీడకు ప్రభుత్వం నుంచి అవసరమైన సదుపాయాలు మరియు సహకారం అందుతుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగలిగే క్రీడాకారులు పెద్ద సంఖ్యలో రావాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఈవెంట్లు ప్రతి సంవత్సరం నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాస్టర్స్ రామస్వామి, కీర్తన్, నాని, శ్రీపాల్, హరీష్ పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చిన్నారి అక్షితను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకులు



**వేలేరు,16 నవంబర్(తెలంగాణ ముచ్చట్లు):** పీచర గ్రామానికి చెందిన బత్తిని సుమన్ మౌనిక దంపతుల కుమార్తె అక్షిత హాఫ్ సారీ ఫంక్షన్ శనివారం గ్రామంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డితో సహా పలువురు నాయకులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మ్యాక రవీందర్, మారబోయిన రాజు, సట్ల రవీందర్, కొయ్యడ మహేందర్, ఎండీ హరీఫ్‌తో పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేయూత అనాధాశ్రమానికి రూ.6 లక్షల విలువైన వాహనం విరాళం



## గొప్ప మనసు చాటుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. చిట్యాల చేయూత అనాధాశ్రమానికి తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు సాయి రెడ్డి, వెంకటమ్మ గార్ల జ్ఞాపకార్థం రూ.6 లక్షల విలువగల వాహనాన్ని విరాళంగా అందించారు.
చేయూత అనాధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ఈ రోజుల్లో కేవలం కన్నతల్లిదండ్రులను చూసుకోవడమే కష్టమైపోయిన పరిస్థితుల్లో, వారి జ్ఞాపకార్థం ఆశ్రమానికి వాహనాన్ని అందించడం ద్వారా ఎమ్మెల్యే తన మహోన్నత మనసును మరొక్కసారి నిరూపించారు. అని అభిప్రాయపడ్డారు. ఆశ్రమంలో ఉన్న అనాధ వృద్ధులకు గ్రామాల వరకు భోజనం చేరవేసేందుకు ఈ వాహనాన్ని వినియోగిస్తామని ఆయన తెలిపారు. మానవత్వం గల ఇలాంటి నాయకులు ప్రజా సేవలో ఎల్లప్పుడూ నిలిచి ఉండాలని ఆశ్రమ నిర్వాహకులు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, చిన్నమందడి మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి, అంకుర్ వెంకటరెడ్డి, ఆర్యభవన్ శ్రీనివాస్, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆదిత్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, లక్కాకుల సతీష్, సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**పెద్దమందడి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన గట్టు రత్నయ్య కుమారుడు రాజశేఖర్ జానకి వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. వీరి వివాహానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ మౌలిక విలువలు, కట్టుబాటు మరియు ప్రేమతో జీవితాన్ని గడపడం ముఖ్యమని సూచిస్తూ.. నూతన వధూవరులకు సంతోషం, శాంతి, ఆరోగ్యం తో కూడిన జీవితాన్ని గడపాలని శుభాకాంక్షలు తెలియజేశారు. వధూవరుల జీవితంలో వెలుకులు, ఆనందాన్ని కలగాలని కోరుతూ వారిని అభినందించారు.
ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా నేమూరీ మహేష్ గౌడ్

**చర్లపల్లి, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కొత్త అధ్యక్షుడిగా నేమూరీ మహేష్ గౌడ్‌ను అధికారికంగా నియమిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చక్రిపురం సిరి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నియామక ప్రకటనను వెల్లడించారు.డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయటం, ప్రజలకు చేరువయ్యే విధంగా కార్యక్రమాలు రూపొందించటంలో మహేష్ గౌడ్ నాయకత్వం ఉపయోగపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# హంసు వర్మ వివాహానికి హాజరుకావాలని ఎమ్మెల్యే మేఘారెడ్డికి ఆహ్వానం



**వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):**పెద్దమందడి మండలం వెలటూరు గ్రామానికి చెందిన డా. హంసు వర్మ (హైకోర్ట్ ఏ.జి.పి.) ఈనెల 30వ తేదీన (ఆదివారం) కొత్తకోట బైపాస్ సమీపంలోని ఏటీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆయన వివాహం జరుగనుంది. ఈ సందర్భంలో..ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డిని శనివారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో కలిసి తన వివాహానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో జీవించాలన్నది నా ఆకాంక్ష. 30వ తేదీన వివాహానికి తప్పకుండా హాజరై ఆశీర్వదిస్తాను అన్నారు. హంసు వర్మ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ను క్యాంప్ ఆఫీస్‌లో కలవడం, తొలి శుభలేఖ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సంతోషం వ్యక్తం చేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్. మహేష్, ఎస్. అశోక్ కుమార్ (రిపోర్టర్), వి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ జెడ్‌పిటిసి సోలిపురం రవీందర్ రెడ్డి తల్లి పద్మమ్మ కన్నుమూత



- **పరామర్శించి నివాళులు అర్పించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** ఖిల్లా ఘణపురం మండలం సోలిపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి, సింగిల్ విండో మాజీ చైర్మన్ తేనేటి రవీందర్ రెడ్డి గారి తల్లి పద్మమ్మ (88) శనివారం మధ్యాహ్నం అనారోగ్యం తో కన్నుమూశారు.
విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం ఉదయం సోలిపురం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పద్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
పద్మమ్మ గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతూ శనివారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా ఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ క్యాం వెంకటయ్య, వెంకట్రావు, గంజాయి రమేష్, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ సతీష్, ఆగారం ప్రకాష్, శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పుట్టు చీర వేడుకల్లో పాల్గొన్న ఏఐపీసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి

**వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మోహన్ కుమార్ యాదవ్ కూతురు పుట్టు చీర కార్యక్రమానికి ఏఐపీసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి హాజరై చిన్నారిని దీవించి.. తల్లిదండ్రులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, అడ్వకేట్ బాబా, ఎం. దేవన్న యాదవ్, నాగార్జున, చరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దెలగూడెం గ్రామంలో నగదు–బంగారం చోరీ

**వేలేరు, 16 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం మద్దెలగూడెం గ్రామంలో దొంగలు నగదు మరియు బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జల్తారు వెంకటేష్ వ్యవసాయ పనుల నిమిత్తం బావివద్దకు వెళ్లిన ఈ సందర్భంగా వారి ఇంటి వద్ద తాళం పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఇంటిలోని ₹62,800 నగదు, ఒక తులం బంగారం, వెండి బ్రాస్లెట్, వెండి మొలతాడు దొంగిలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దొంగిలించిన ఆస్తి మొత్తం విలువ ₹1,52,800గా అంచనా. ఘటన సమయంలో ఒక అనుమానాస్పద వ్యక్తి గ్రామ పరిసరాల్లో తిరుగుతుండటంతో స్థానికులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతోందని వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు.

# ఓ కవీ!

చరిత్ర సంస్కృతి
ఆధ్యాత్మికం..
గురించి చాలా
రాసావు!
..............

రాచరికాలు
రాణివాసాలు
మహాసామ్రాజ్యాలు
..............

చక్రవర్తులు
దండయాత్రలు
గతం గతః!
..............

నీ పాండిత్యం
అక్షరలక్షలు
గండపెండేరాలు
..............

గుళ్ళు గోపురాలు
జానపదాలు
చెప్పిందించాలు!
..............

దేవుడు దెయ్యాలు
ఆత్మలు పైలోకాలు
ఇంకచాలు! ఆపు!
..............

భూతకాలం
మాకు బాగానే
అర్థమైంది!
..............

వర్తమానమే
అర్థంకావటంలేదు!
దానిగురించి చెప్పు!
..............

మనిషిని మనిషి
దోపిడీచేస్తున్నాడు
ఇది ఎలాగోచెప్పు!
..............

అది అర్థంకాక
పాత కాలంలోనే
ఉండిపోయారు జనం!
..............

మనుషులదేముందిలే
అంతా పైవాడిదే
అని చెప్పకు!
..............

రాజాస్తానాలు
అక్షరలక్షలు
ఇచ్చేవాళ్ళు లేరు!
..............

అబద్ధాలు
అతిశయోక్తులు
చెప్పే పనిలేదు!
..............

అది చాలామోసం
పక్కదారి
పట్టించటం
ఇక్కడేం జరుగుతోంది?
..............

నిజంచెప్పు
అప్పుడు నీకీర్తి
అజరామరం!
..............

ప్రజాస్వామ్యం
కులాలు మతాలు
ఓట్లు ఎన్నికలు
..............

మనువాదం
సనాతనం
చాతుర్వర్ణాలు
..............

ఇక్కడిజనాలు
భజనలు,గుళ్లో
భోజనాలతో సరి!
..............

నాయకులు కూడా
గుళ్లను జీర్ణోద్ధరణచేసి
ఆనందిస్తున్నారు!
..............

ఇవీ ఇప్పుడు
మండుతున్న సమస్యలు!
..............

వీటిమీద
స్పష్టత కావాలి
వాటి గురించి చెప్పు!
..............

ప్రపంచ మార్కెట్లు
జరుగుతున్న యుద్ధాలు
కార్పొరేట్ల దోపిడీ
..............

ఇజ్రాయల్ దురాక్రమణ
అమెరికాసుంకాలు
వీళ్ళ అహంకారాలు!
..............

గాజా యుద్ధం
కాశ్మీర్ సమస్య
నిత్యం మరణాలు
..............

రోజురోజుకు
సంక్షుభితం
ఔతున్న జీవనం
..............

పేదల ఇక్కట్లు
ధనికుల దోపిడీ
ఏంటీ రహస్యం?
..............

ఎవడికివాడుదొంగలు
పేదలరక్తంఎంతతాగినా
వీళ్లకు చాలటం లేదు!
..............

ఓ కవీ! వీటిగురించి రాసి
కర్తవ్య బోధ చెయ్యి!
..............

నీ జీవితం ధన్యం!
నీకు నమో వాకాలు!
రాస్తావుకదూ!
..............

– తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్




# 'డ్రాగన్'లో ఫాదర్ ఎమోషన్ హైలైట్ అట!

ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమా అప్ డేట్స్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో ఫాదర్ ఎమోషన్ కూడా మెయిన్ హైలైట్ గా ఉంటుందట. ముఖ్యంగా సెకండ్ హాఫ్ ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే ఫ్యామిలీ ఎపిసోడ్ సినిమా మొత్తానికే మెయిన్ హైలైట్ అని, ఆ ఎపిసోడ్ లో ఎన్టీఆర్ కూడా సరికొత్త గెటప్ లో కనిస్తారని తెలుస్తోంది. ఎలాగూ ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలో సినిమా అంటే యాక్షన్ అద్భుతంగా ఉంటుంది. ఇక ప్రస్తుతం కొత్త షెడ్యూల్ కోసం మేకర్స్ ఫిల్మ్ సిటీలో భారీ సెట్స్ వేస్తున్నారు. కాగా 'డ్రాగన్' సినిమాని ఎన్టీఆర్ కెరీర్ లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లోకల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.




# 'లెనిన్' క్లైమాక్స్ కోసం అఖిల్ ప్రాక్టీస్ !

అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రస్తుతం తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్ లో చేస్తున్నాడు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఆల్ రెడీ మొదలైంది. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్ లో బ్యాలెన్స్ షూట్ ను పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్లైమాక్స్ కోసం అఖిల్ యాక్షన్ స్టంట్స్ ను ప్రాక్టీస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నట్టు ఈ క్లైమాక్స్ లో ఓ స్పెషల్ గెస్ట్ రోల్ కూడా ఉందని టాక్. మరి ఈ పాత్రలో ఎవరు కనిపిస్తారో చూడాలి. కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్ తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తోంది. ఇక సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా అఖిల్ - భాగ్య శ్రీ కలయికలో లవ్ సీన్స్ చాలా బాగుంటాయట. అన్నట్టు ఈ సినిమా పై అఖిల్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు. సినిమా అవుట్ పుట్ అయితే బాగా వస్తోందని టీమ్ చెబుతుంది. మరి ఈ సినిమాతో అఖిల్ హిట్ కొడతాడో లేదో చూడాలి.



# 'తల్లిదండ్రుల క్లబ్‌లోకి రాజ్‌కుమార్ దంపతులు !

బాలీవుడ్ లో రాజ్‌కుమార్ రావ్ కి మంచి ఇమేజ్ ఉంది. పైగా నార్త్ లో అత్యంత ప్రతిభావంతులైన నటులలో రాజ్‌కుమార్ రావు కూడా ఒకరు. కాగా రాజ్‌కుమార్ రావ్, పత్రలేఖ జంట తల్లిదండ్రులయ్యారు. పత్రలేఖ పండంటి పాపకు జన్మనిచ్చింది. రాజ్‌కుమార్ రావ్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా తెలుపుతూ ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు. 'మా 4వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దేవుడు మాకు ఇచ్చిన గొప్ప ఆశీర్వాదం ఇది. మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి'' అంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాజ్‌కుమార్ రావ్, పత్రలేఖ జంట పేరెంట్స్ గా మారడంతో 'తల్లిదండ్రుల క్లబ్‌లోకి స్వాగతం' అంటూ పలువురు బాలీవుడ్ సినీతారలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. సినిమాల విషయానికొస్తే.. ఇటీవలే 'మాలిక్', 'భూల్ చుక్ మాఫ్' లాంటి చిత్రాలతో రాజ్‌కుమార్ రావ్ ప్రేక్షకుల్ని పలకరించారు.

# పెళ్లి రూమర్స్ పై స్టార్ హీరోయిన్ రియాక్షన్



సీనియర్ హీరోయిన్ త్రిష స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి హీరోగా, యంగ్ దర్శకుడు వశిష్ట కలయికలో వస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. ఐతే, గత కొంతకాలంగా త్రిష పెళ్లి పై పుకార్లు షికార్లు చేస్తున్నాయి. మరోవైపు 41 ఏళ్లు దాటిపోతున్నా త్రిష ఇంకా పెళ్లి చేసుకోకుండా సింగిల్ గానే ఉంది. ఐతే, త్రిష, స్టార్ హీరో విజయ్‌తో రిలేషన్‌లో ఉందని గతంలో రూమర్స్ వచ్చాయి. పైగా విజయ్ పుట్టినరోజు నాడు విజయ్, త్రిష కుక్కపిల్ల (ఇజ్జి)ని ఎత్తుకొని ఆడిస్తూ ఉండగా, త్రిష.. విజయ్ పక్కనే కూర్చుని నవ్వుతూ కనిపించింది. ఆ ఫోటోతో వీరిద్దరి మధ్య ఏదో జరుగుతుంది అని గట్టిగా ప్రచారం జరిగింది. తాజాగా త్రిష, ఈ వార్తలు రియాక్ట్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీలో నాకు చాలామంది స్నేహితులు ఉన్నారు. వారందరితో నాకు పెళ్లి అని రాసేవారు. ఇంకా రాస్తున్నారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేస్తోంది. దయచేసి ఇలాంటి ఫేక్ వార్తలను వైరల్ చేయకండి' అంటూ త్రిష చెప్పుకొచ్చింది. ప్రస్తుతానికి అయితే, త్రిష సినిమాల పైనే ఫోకస్ పెట్టిందట.

# '3డి' లో రాబోతున్న బాలయ్య 'అఖండ 2' !

నటసింహం బాలయ్య - బోయపాటి శ్రీను కాంబినేషన్లో వచ్చిన 'అఖండ' చిత్రం అద్భుత విజయాన్ని సాధించింది. దీంతో, 'అఖండ 2 - తాండవం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారీ విడుదలకు రెడీ అవుతున్న ఈ చిత్రం మొదటి సింగిల్ ఇటీవల పూణేలో జరిగిన ఒక కార్యక్రమంలో రిలీజ్ అయింది. ఐతే, తాజాగా ఈ చిత్రం 3డి ఫార్మాట్ లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. నిజంగా ఇది ప్రేక్షకులకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తుంది. ఐతే, ఇది ఒక సాహసోపేతమైన నిర్ణయమే. మరి ఈ నిర్ణయం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. ఈ సినిమాలో సంయుక్త కథానాయికగా కనిపించనున్నారు. ఆది పినిశెట్టి విలన్ పాత్రను పోషిస్తున్నారు. తమన్ స్వరాలు అందిస్తోన్న ఈ సినిమా ఈ ఏడాది డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. అన్నట్టు ఇప్పటికే, విడుదలైన ఈ సినిమా టీజర్ ట్రెండ్ సృష్టించిన విషయం తెలిసిందే. అఖండ 2 - తాండవం' పై రెట్టింపు అంచనాలు ఉన్నాయి. కాగా ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు.




# కొరగజ్జ మరో కాంతార కానుందా..? ఫస్ట్ లుక్‌తో సూపర్ హైప్

గ్రామీణ సంస్కృతి, ఆచారాల నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన కాంతార బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయిలో హిట్‌గా నిలిచిందో తెలిసిందే. కన్నడ నాట నుంచి పలు భాషల్లో విడుదలై పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇప్పుడు మళ్లీ అలాంటి టచ్ ఇస్తూ శాండల్‌వుడ్ నుంచి మరో సినిమా రాబోతుంది. అదే 'కొరగజ్జ' కన్నడ, మలయాళం, హిందీ, తెలుగు, తమిళ్, తులు భాషల్లో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కబీర్ బేడీ కింగ్ ఆఫ్ ఉడయవరగా కనిపించబోతుండగా.. భవ్య, శృతి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. కాంతార సినిమాను గుర్తు చేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో లీడ్ క్యారెక్టర్ కొరగజ్జ థీమ్‌ను ప్రతిబింబించేలా సరికొత్త గెటప్‌లో కనిపిస్తూ.. కొరగజ్జ మరో కాంతార కాబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రానికి గోపీసుందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీలోని అన్ని పాటలను డైరెక్టర్ కమ్ రైటర్ సుధీర్ అత్తావర్ రాయడం విశేషం. కర్ణాటక తులునాడులో పూజింపబడే దైవం 'కొరగజ్జ' కథతో ఈ సినిమా రాబోతుంది.




సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని త్రివిక్రమ్ సాఫల్య నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా కర్ణాటకలోని మంగళూరులో ఆడియో లాంచ్ చేశారని తెలిసిందే. 'కాంతార' తరహాలో గ్రామీణ సంస్కృతి, ఆచారాలు కలబోసిన దైవగాథ ఇదని, ప్రేక్షకుల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేలా ఉంటుందని డైరెక్టర్ సుధీర్ అత్తావర్ క్లారిటీ కూడా ఇచ్చాడు.


# దే దే ప్యార్ దే 2 వసూళ్లు ఎంత?

బాలీవుడ్ యాక్టర్ అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్లీడ్ రోల్‌స్‌లో నటించిన మూవీ 'దే దే ప్యార్ దే 2'. అన్షుల్ శర్మ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రంలో కోలీవుడ్ స్టార్ మాధవన్ కీలక పాత్రలో నటించాడు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది.ఓపెనింగ్ డేన వరల్డ్ వైడ్‌గా రూ.9.45 కోట్లు రాబట్టిన ఈ చిత్రం.. రెండో రోజు రూ.13.77 కోట్లు వసూళ్లు చేసింది. అంటే ఈ చిత్రం యావరేజ్‌గా రెండు రోజుల్లో మొత్తం రూ.23.22 కోట్లు రాబట్టింది. ఆదివారం సెలవు కావడంతో సినిమాకు వెళ్లేవారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుందని తెలిసిందే. ఇప్పటివరకు మిక్స్‌డ్ రివ్యూస్ రాగా.. మరి ఆదివారం కలెక్షన్ల విషయంలో ఎంత స్థాయిలో పెరుగుదల ఉంటుందనేది చూడాల్సి ఉంది. మరి ఈ చిత్రం రూ.50 కోట్ల గ్రాస్ మైల్ స్టోన్‌కు చేరుకుంటుందా..? అనేది చూడాలి.దే దే ప్యార్ దే ఫస్ట్ పార్ట్ లో తనకంటే వయసులో చాలా చిన్నదైన ఆయేషా (రకుల్ ప్రీత్ సింగ్)ను ప్రేమ పెళ్లి చేసుకోవాలి అనుకున్న ఆశిష్ (అజయ్ దేవగణ్) తన మాజీ భార్య (టబు) పర్మిషన్‌తోపాటు ఆమె కుటుంబం అంగీకారాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు.ఆయేషా కుటుంబాన్ని ఆశీష్ ఎలా పెళ్లికి ఒప్పిస్తాడు అనే నేపథ్యంలో సీక్వెల్ సాగనుందని ఇప్పటికే ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. సీక్వెల్‌లో ఆయేషా తండ్రి రోల్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ ఆర్. మాధవన్ నటించాడు. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు లవ్ రంజన్ కథ అందించారు. 2019లో ప్రేక్షకుల ముందుకొచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'దే దే ప్యార్ దే'కి సీక్వెల్‌గా వచ్చింది.




తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మైగ్రేన్ సమస్యకి.. న్యూరో స్టిమ్యులేటర్ ఇంప్లాంట్‌తో చెక్?



ఇటీవల జీవన విధానంలో వచ్చే మార్పుల వలన, అధిక పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, మానసిక ఇబ్బందుల కారణంగా చాలా మంది విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్నారు.ఈ సమస్య కారణంగా ఏ పని సరిగ్గా చేయలేకపోతుంటారు. కొందరు దీర్ఘకాలికంగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. అయితే వీరు వైద్యులను సంప్రదించి ట్రిట్‌మెంట్ తీసుకున్నప్పటికి తాత్కలిక ఉపశమనమే తప్ప సమస్య నుంచి విముక్తి లభించడం లేదని చింతిస్తున్నారు. ఈ సమస్యకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ వైద్యులు చేసిన ట్రీట్మెంట్ సక్సెస్ అయిందని సమాచారం. మైగ్రేన్‌తో బాధపడుతున్న మారిషస్‌కు చెందిన 24 ఏళ్ల మహిళ పలు దేశాల్లో తన సమస్యకు చికిత్స తీసుకున్నా పూర్తిస్థాయిలో నయం కాకపోవడంతో ఆమె హైదరాబాద్‌కు వచ్చి ఏఐజీ వైద్యులను సంప్రదించారంట. అప్పుడు ఏఐజీ వైద్యులు ఆమెకు పేస్‌మేకర్ మాదిరిగా న్యూరో స్టిమ్యులేటర్ ఇంప్లాంట్ ద్వారా మైగ్రేన్‌కు చికిత్స అందించారు. సీనియర్ కన్సల్టెంట్ క్రానిక్ పెయిన్, న్యూరోమాడ్యులేషన్ నిపుణులు డాక్టర్ సిద్ధార్థ్ చావలి, న్యూరో సర్జరీ విభాగం డైరెక్టర్ డాక్టర్ సుబోధ్ కలిసి బాధితురాలిని పరిశీలించారు. ఆ తర్వాత ఆమెకు హై సర్వైకల్ స్పైనల్ కార్డ్ స్టిమ్యులేటర్ ఇంప్లాంటేషన్ ప్రక్రియతో చికిత్స చేయాలని నిర్ణయించుకున్నారంట. అయితే శరీరంలో ఎక్కడ నొప్పి కలిగిన ఆ సంకేతాలు మెదడుకు అందుతాయని.. న్యూరో స్టిమ్యులేటర్ ద్వారా నొప్పికి సంబంధించిన సంకేతాలు మెదడుకు చేరుకోక ముందే అడ్డుకుని ఉపశమనం కలిగించే అవకాశం ఉందని గమనించారు. ఈ చికిత్సా పద్ధతినే మారిషస్ మహిళకు చేశారు. న్యూరో స్టిమ్యూలేటర్ ఇంప్లాంట్ ద్వారా చికిత్స సక్సెస్ అవటమనేది ఆసియాలోనే తొలిసారి అని ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ న్యూరో స్టిమ్యులేటర్ ఇంప్లాంట్ కోసం 11 నుంచి 12 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెబుతున్నారు.

# సరైన నిద్రలేదంటే డయాబెటిస్ ప్రమాదం..




తక్కువ నిద్ర లేదా నిద్రలేమి వివిధ అనారోగ్యాలకు కారణం అవుతుందన్న విషయం తెలిసిందే. అయితే కనీసం ఆరు గంటలకంటే తక్కువగా నిద్రపోయే వారిలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది.స్టడీలో భాగంగా పరిశోధకులు సుమారు 2,50,000 మందికి సంబంధించిన హెల్త్ డేటాను యూకే బయోబ్యాంక్ నుంచి సేకరించి విశ్లేషించారు. కొందరిని స్వయంగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు ఆరుగంటకంటే తక్కువగా నిద్రపోయే వారిలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 16 శాతం ఎక్కువగా ఉన్నట్లు కనుగొన్నారు.నిద్ర, మధుమేహం మధ్య ఎలాంటి సంబంధం ఉంది? ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతుందనే విషయాన్ని తెలుసుకోవడానికి రీసెర్చర్స్ పలువురు పార్టిసిపెంట్‌స్‌ను అబ్జర్వ్ చేశారు. 24 గంటల్లో ఎంత సేపు నిద్రపోతున్నారని అడిగారు. యావరేజ్‌గా ఏడు లేదా ఎనిమిది గంటలు నిద్రపోవడం అనేది సాధారణ ఆరోగ్య లక్షణం అయినప్పటికీ, ఈ సందర్భంగా పరిశోధకులు మైల్డ్ స్లీప్ (ఆరు గంటలు), మోడరేట్ స్లీప్ (ఐదు గంటలు), అలాగే ఎక్స్‌ట్రీమ్ స్లీప్ (మూడు నుంచి నాలుగు గంటలు) ఇలా.. మూడు కేటగిరీలుగా విభజించి అబ్జర్వేషన్ కొనసాగించారు. అయితే హెల్తీ ఈటింగ్ హాబిట్స్ వల్ల డయాబెటిస్ వచ్చే రిస్క్ తక్కువగా ఉంటుందని అధ్యయనం కనుగొన్నప్పటికీ, ఈ అలవాటు ఉన్నవారిలో కూడా రోజుకు ఐదు గంటలకంటే తక్కువ నిద్రపోపయే వ్యక్తుల్లో , ఏడు లేదా ఎనిమిది గంటలు నిద్రపోయే వారితో పోల్చితే టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరిగినట్లు గమనించారు. ఐదు గంటలపాటు నిద్రపోవడంవల్ల మధుమేహం వచ్చే రిస్క్ 16 శాతం పెరుగుతుందని, అలాగే రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు మాత్రమే నిద్రపోయేవారిలో డయాబటిస్ వచ్చే ప్రమాదం 41 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుగొన్నారు. అందుకే ప్రతి వ్యక్తికి 7 నుంచి 8 గంటల నిద్ర తప్పక అవసరమని సూచిస్తున్నారు.

# కిడ్నీలను పనితీరుపై ఉప్పు, చక్కెర ప్రభావం చూపుతాయా..?





సాధారణ ఆరోగ్యానికి అద్భుతమైన మూత్రపిండాల పనితీరును నిర్వహించడం చాలా ముఖ్యం ఎందుకంటే ఈ అసాధారణ అవయవాలు వ్యర్థాలను ఫిల్టర్ చేస్తాయి, మన శరీరంలో ద్రవ సమతుల్యతను నియంత్రిస్తాయి.ఆహార ఎంపికలు మూత్రపిండాల ఆరోగ్యంపై పెద్ద ప్రభావాన్ని చూపుతాయి, అనేక ఆహారాలలో కనిపించే రెండు ప్రాథమిక పదార్థాలు చక్కెర, ఉప్పు తరచుగా పరిశీలించబడతాయి. అధిక చక్కెర వినియోగం ఊబకాయం, మధుమేహం మరియు హృదయ సంబంధ వ్యాధులతో సహా వివిధ ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉంది. అయితే, మూత్రపిండాల ఆరోగ్యం విషయానికి వస్తే, చక్కెర యొక్క ప్రత్యక్ష ప్రభావం తక్కువగా ఉంటుంది. చక్కెర నేరుగా మూత్రపిండాలకు హాని కలిగించదు, కానీ మధుమేహం వంటి పరిస్థితులు, అధిక చక్కెర ఆహారం నుండి ఉత్పన్నమవుతాయి, కాలక్రమేణా మూత్రపిండాలు దెబ్బతింటాయి.ఎక్కువ ఉప్పు, చక్కెర మరియు మాంసం తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై అదనపు ఒత్తిడి ఉంటుంది, ఇది అధిక రక్తపోటు మరియు మధుమేహం వంటి పరిస్థితులకు దారితీస్తుంది, ఇది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. మరోవైపు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు మరియు తృణధాన్యాలు వంటి మొక్కల ఆధారిత ఆహారాన్ని తినడం వల్ల చాలా పోషకాలు అందుతాయి మరియు మూత్రపిండాలపై అదనపు భారాన్ని కూడా తగ్గిస్తుంది. ఈ రకమైన ఆహారం రక్తపోటును తగ్గిస్తుంది, చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది మరియు మీ మూత్రపిండాలు ఒత్తిడి లేకుండా పని చేస్తుంది.మీ మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడానికి సోడియం, చక్కెర మరియు ప్రోటీన్‌లను ట్రాక్ చేయడం ముఖ్యం. అలాగే పొటాషియం మరియు ఫాస్పరస్ స్థాయిల సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం, ముఖ్యంగా కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి.ప్రాసెస్ చేసిన వాటికి బదులుగా సహజమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల మీ కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. మీరు తినే దానిలో ఎక్కువ ఉప్పు లేదా చక్కెర దాగి ఉందో లేదో తెలుసుకోవడానికి ఎల్లప్పుడూ ఆహార ఉత్పత్తులపై పోషక లేబుల్‌ని తనిఖీ చేయండి. అలాగే, తగినంత నీరు తీసుకోవడం అలవాటు చేసుకోండి. ఇది మన శరీరంలోని టాక్సిన్‌స్‌ను శుభ్రపరచడంలో సహాయపడుతుంది మరియు మన కిడ్నీలు బాగా పనిచేసేలా చేస్తుంది. మనం ఏమి తింటున్నామో మరియు అది మన కిడ్నీలను ఎలా ప్రభావితం చేస్తుందో శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. మనం ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకుంటే, మన కిడ్నీలను సురక్షితంగా ఉంచుకోవచ్చు మరియు కిడ్నీ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలను తగ్గిస్తాయి. దీని గురించి అందరికీ తెలుసునని నిర్ధారించు కోవాలి, కాబట్టి మన కిడ్నీకి మరిం త మేలు చేసే విధంగా తినడంపై దృష్టి పెట్టాలి.

# ఫాస్ట్ ఫుడ్ తింటున్నారా..




ఫాస్ట్ ఫుడ్ అంటే ఇష్టపడని వారు ఉండరు. చాలా మంది ఎంతో ఇష్టంగా బయటకు వెళ్లి ఫాస్ట్ ఫుడ్ తిని వస్తారు. ఇంకొందరు ఇంట్లో వంట కూడా చేయకుండా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నుంచి పార్సిల్ తెచ్చుకొని ఇష్టంగా తింటూ ఉంటారు.అయితే తాజాగా చేసిన ఓ సర్వేలో షాకింగ్ విషయాలు వెల్లడి అయ్యాయి.చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, ఇతర ఫాస్ట్ ఫూడ్ వల్ల దీర్ఘకాలికంగా మెదడు దెబ్బ తినవచ్చని, ఇది మన పైనే కాకుండా రాబోయే తరాలపై కూడా ప్రభావం చూపుతోందని వారు పేర్కొన్నారు. అయితే చికాగోకు చెందిన యూనివర్సిటీ వారు రెస్టారెంట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లోని ఫుడ్‌ను ఎలకలకు తినిపించి అధ్యయనం చేశారు. ఆహారం తిన్న ఎలుకల కాలేయంలో వాపు, జాపకశక్తి తగ్గడం, అలాగే దీర్ఘకాలంలో డిమెన్షియాకి కారణం అవ్వడం గుర్తించారు. అయితే ఇలా ఎందుకు జరుగుతుందని సెర్చ్ చేయగా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఎక్కువగా వేడి చేసిన నూనెను, పదే పదే వాడుతారు, దీని వలన మెదడు దెబ్బతిన్నట్లు వారు తెలిపారు. అంతే కాకుండా ఈ ఆహారం తిన్న ఎలుక పిల్లల్లో కూడా అదే సమస్య కనిపించిందంట. దీంతో అలాంటి ఫుడ్ తినకూడదని పరిశోధకులు తెలుపుతున్నారు. ముఖ్యంగా నువ్వుల నూనె, సన్ ఫ్లవర్ ఆయిల్ మళ్లీ మళ్లీ వేడి చేసినపుడు కాలేయంలో ఆక్సిడేషన్ ఒత్తిడి, ఇన్ఫ్లమేషన్ పెరిగింది. పెద్దపేగుల్లో సమస్యలు, అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి న్యూరో డిజనరేటివ్ వ్యాధులు ఏర్పడే ప్రమాదం ఉదని, అందువలన ఫాస్ట్ ఫుడ్, రెస్టారెంట్ ఫుడ్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచిదని వారు పేర్కొన్నారు.

# తమలపాకు తింటే ఎన్ని లాభాలో!.



ఛాతీలో కఫం, ఊపిరితిత్తుల సమస్యలు, ఆస్తమా బాధితులకు తమలపాకు అద్భుతమైన నివారణ. ఇందుకోసం తమల ఆకుపై కొద్దిగా ఆవాల నూనె రాసి, వేడి చేసి ఛాతీపై ఉంచితే రద్దీ తగ్గుతుంది.మీరు కొన్ని ఆకులను నీటిలో ఉడకబెట్టవచ్చు, రెండు కప్పుల నీటిలో ఏలకులు, లవంగాల, దాల్చినచెక్క వేసి నీరు సగానికి తగ్గేవరకు మరిగించాలి. ఆపై ఈ ద్రావణాన్ని రోజుకు రెండు, మూడుసార్లు తీసుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెప్పారు.తమలపాకులు నొప్పిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పాన్ ఆకుల పేస్ట్‌ను గాయాలపై రాస్తే వెంటనే పెయిన్ నుంచి ఉపశమనం లభిస్తుంది. తమలపాకుల రసం తాగడం వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. చర్మ సంబంధిత సమస్యలు ఉన్నవారికి తమలపాకులు అద్భుతాలు చేస్తాయి. ఎందుకంటే ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి.భోజనం చేసిన తర్వాత తమలపాకు నమలడం వల్ల మీ జీర్ణక్రియతోపాటు రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇందులో ఉండే విటమిన్లు, పోషకాలు ప్రేగులను క్లీన్ చేస్తాయి. పాన్ ఆకులు నమలడం వల్ల మీ నోటి దుర్వాసన దూరమవుతుంది. అంతేకాదు.. దంతాల్లో క్యావిటీస్, దంతక్షయాన్ని అరికట్టి నోటిని ఆరోగ్యంగా ఉంచుతుంది. జంక్ ఫుడ్ , ఫాస్ట్ ఫుడ్ , ఆయిల్ ఫుడ్ వంటివి తీసుకోవడం వల్ల కడుపులో కలిగే ఇబ్బందిని తమలపాకు దూరం చేస్తుంది. తమలపాకు నమలడం వల్ల అజీర్ణం, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది. అంతేకాదు.. తమలపాకుని సాధారణంగా మౌత్ ఫ్రెషనర్‌గా పరిగణిస్తారు. తమలపాకులు నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. ఇందులోని యాంటీ మైక్రోబియల్ లక్షణాలు మీ నోటి దుర్వాసనను తొలగిస్తాయి. శ్వాస సమస్యలు ఉన్నవారు తమలపాకులతో పాటు లవంగాలను నీళ్లలో వేసి బాగా మరిగించి తాగాలి. దీని వల్ల చాలా వరకు ఉపశమనం పొందుతారు. అలాగే, గుండె జబ్బులతో బాధపడే వారికి కూడా తమలపాకు ఎంతో మేలు చేస్తుంది. తమలపాకు రసం తాగడం వల్ల గుండె జబ్బులకు మేలు చేస్తుంది. తమలపాకులు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి

# తాటి ముంజలు: ఇన్ని సమస్యలకు చెక్..!



వేసవికాలం వచ్చిందంటే చాలు కొన్ని కొన్ని పండ్లు మాత్రం ఈ సీజన్లోని దొరుకుతూ ఉంటాయి. అలాంటి వాటిలో తాటి ముంజలు కూడా ఒకటి.. వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నది.ఇవి తినడానికి తియ్యగా చాలా సాఫ్ట్ గా ఉన్నప్పటికీ చాలామంది వీటిని తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. ఇలా తాటి ముంజలు తినడం వల్ల శరీరానికి చాలా ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా ఎలాంటి అధిక వేడినైనా సరే శరీరాన్ని చల్లబరిచే తత్వం ఈ తాటి ముంజలలో ఎక్కువగా ఉంటుందట.తాటి ముంజలలో ఎక్కువగా విటమిన్స్, ఖనిజాలు, మినరల్స్ వంటివి పుష్కలంగా లభిస్తాయి. అందుచేతనే వీటిని తినడం వల్ల శరీరానికి హైడ్రేట్‌గా ఉంటుంది. తాటి ముంజలలో ఎక్కువగా నీటి శాతమే ఉంటుంది. అందుచేతనే వీటిని తిన్నా కూడా మన శరీరం డిహైడ్రేట్ కాకుండా ఉంటుందట. తాటి ముంజలు తినడం వల్ల శరీరంలో ఉండే రోగనిరోధక శక్తి కూడా తగ్గదు..ఎవరికైనా దగ్గు ,జలుబు ఉంటే వాటిని అమాంతం దూరం చేస్తాయి. డయాబెటిస్ రోగులు సైతం తాటి ముంజలు పైన తోలు తీయకుండా తినడం వల్ల షుగర్ లెవెల్స్ పెరగవు. తాటి ముంజలలో ఎక్కువగా క్యాలరీలు ఉండవు కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు వీటిని తినడం చాలా మంచిది.. అంతేకాకుండా ఇందులో ఉండేటువంటి యాంటీ ఆక్సిడెంట్ల వల్ల చర్మం మృదువుగా మారడమే కాకుండా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అలాగే జుట్టు రాలే సమస్యతో ఇబ్బంది పడేవారు వీటిని తినడం మంచిది. మూత్రపిండాలలోనే ఉండేటువంటి రాళ్లను కూడా లేకుండా చేస్తాయి తాటి ముంజలు.. తాటి ముంజలు తరచూ తింటూ ఉండటం వల్ల కంటి సమస్యలను దూరం చేస్తుంది అలాగే రక్తహీనత సమస్యను కూడా నివారిస్తుంది.. తాటి ముంజలు ఎక్కువగా తినడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. జీర్ణ వ్యవస్థ కూడా చాలా చక్కగా పనిచేస్తుంది.

# ఈ చెట్టు వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో..



సహజంగానే ప్రకృతి ఎన్నో ఔషధాలను విటమిన్లు, మినరల్స్ ను అందిస్తుంటుంది. ఆకులు, కూరగాయలు, పండ్లతో మనుషుల ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు అందుతాయి.అంతే కాదు ఎన్నో ఉపయోగాలు కూడా ఉంటాయి. ప్రకృతి అందించే వాటిలో మునగ చెట్టు కూడా ఒకటి. దీన్ని ఒక అద్భుతమైన చెట్టుగా పరిగణిస్తారు. నీరు ఉండే స్థలంలో ఈ చెట్టు ఎక్కువగా పెరిగి రైతులకు అధిక ఆదాయాన్ని సంపాదించి పెడుతుంది. మునగ కాయలు, ఆకులు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయి.ఒక్క మునగాకు తిన్నా కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇందులో ఉండే పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అంతేకాదు రక్తహీనతకు కూడా మంచి ఔషధంగా పనిచేస్తుందట. అయితే మునగాకు ఉత్పత్తిలో మన దేశం మొదటి స్థానంలో ఉందని చెబుతున్నాయి గణాంకాలు. ఈ మునగ తోటల పెంపకం వల్ల ఆదాయం, ఆరోగ్యం రెండు చేపట్టవచ్చు. మరి ఈ మునగ తోటల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలు, తోట విలువ ఆధారిత పదార్థాల తయారీ గురించి కూడా తెలుసుకుందాం. రక్తహీనత సమస్యను తగ్గించడానికి ఐరన్ మాత్రలను వాడుతుంటారు ప్రజలు. కానీ దీనికి బదులు మునగ ఆకు పొడిని తీసుకుంటే రక్తహీనత సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చట. పాలకంటే మునగాకులో నాలుగు రెట్ల కాల్షియం, రెండు రెట్లు అధికంగా జీర్ణం అయ్యే ప్రోటీన్లు ఉంటాయట. దీనివల్ల కాల్షియం సప్లిమెంట్ ల మాదిరి కూడా ఈ మునగ ఆకు ఉపయోగపడుతుంది. ఇక మునగ కాయలను పప్పులో వేసుకొని లేదా విడిగా వీటిని కూరగా కూడా చేసుకొని తిన్నా మంచి ప్రయోజనం ఉంటుంది. మునగాకుతో రొట్టెలు, బిస్కెట్లు, తదితర వంటకాలను కూడా తయారు చేసుకోవచ్చు. మునగ చెట్టు ఆకులు కాయలు గింజలలో ప్రజలకు కావాల్సిన ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇందులో పోటాషియం, జింక్, మెగ్నీషియం, రాగి, ఇనుము వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. అందుకే మునగాకు, మునగ కాయలు ప్రతిరోజు ఆహారంలో చేర్చుకోవాలి. దీని వల్ల ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవు.

# లివోజెన్ ఐరన్ గమ్మీస్ కొత్తగా ప్రారంభం

ప్రాక్టర్ & గాంబిల్ హెల్త్ లిమిటెడ్, లివోజెన్ ఐరన్ గమ్మీస్‌ను ఈ రోజు అధికారికంగా ఆవిష్కరించింది. ఇవి మహిళలు రోజూ అవసరమయ్యే ఐరన్‌ను పూరించేందుకు సహాయపడటమే లక్ష్యంగా రూపొందించబడ్డాయి. లివోజెన్ - భారతదేశంలో డాక్టర్లు ఎక్కువగా సిఫారసు చేసే ఐరన్ సప్లిమెంట్ బ్రాండ్* - పోర్ట్‌ఫోలియోలోని ఈ నూతన ఉత్పత్తి, శరీరానికి అవసరమైన ఐరన్‌ను రుచికరమైన స్ట్రాబెర్రీ ఫ్లేవర్ గమ్మీస్ రూపంలో అందిస్తుంది. ఇది కడుపుకు మృదువుగా ఉండి, ఐరన్ సప్లిమెంటేషన్‌ను మరింత సులభంగా మరియు రుచికరంగా చేస్తుంది. రోజుకు రెండు గమ్మీస్ తీసుకుంటే అది రెండు గిన్నెల పాలకూరలో ఉండే ఐరన్‌కు సమానం.ఐరన్ శరీర రోగనిరోధక శక్తిని బలపరచడంలో, చర్మం, జుట్టు మరియు గోళ్ల ఆరోగ్యాన్ని కాపాడడంలో, అలాగే 12గ్రా/డెసిలీటర్ హీమోగ్లోబిన్ స్థాయిని నిల్వ ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. నివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు ఐరన్ లోపం,




అనీమియాతో బాధపడుతున్నారు. ఈ సమస్యను తరచుగా నిద్రలేమి లేదా విటమిన్ లోపాలుగా పొరబడటం వల్ల, చాలాసార్లు మహిళలు ఉపయోగం లేకుండా ఉండే ఇంటి చిట్కాలు లేదా సాధారణ మల్టీవిటమిన్లపై ఆధారపడుతున్నారు. గత 50 ఏళ్లుగా లివోజెన్ ఈ సమస్యను ఎదుర్కొనడంలో ముందంజలో ఉంది. పెద్దలు, గర్భిణీలు, పిల్లలు వంటి విభిన్న వర్గాల అవసరాలకు అనుగుణంగా నూతన ఐరన్ పరిష్కారాలను అందిస్తోంది. ఈ లివోజెన్ ఐరన్ గమ్మీస్ కూడా అదే ప్రయాణంలో భాగంగా, మహిళల రోజువారీ ఐరన్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు రూపొందించబడ్డాయి. ఐరన్ లోపంతో బాధపడుతున్న 5 సంవత్సరాలు పైబడిన పిల్లలు కూడా వీటిని తీసుకోవచ్చు. "లివోజెన్ బ్రాండ్, రక్త ఆరోగ్య రంగంలో 50 సంవత్సరాల వారసత్వంతో, ఐరన్ లోపంతో నిశ్శబ్దంగా పోరాడుతున్న లక్షలాది భారతీయ మహిళలను బలపరచాలనే మా లక్ష్యాన్ని కొనసాగిస్తోంది. భారతీయుల ఐరన్ అవసరాలను సులభతరం చేయడంలో మేము ఎప్పుడూ ముందంజలోనే ఉన్నాము. ఇప్పుడు మా లివోజెన్ ఐరన్ గమ్మీస్ ఆ ప్రయాణంలో మరో కీలక దశ. మా డాక్టర్ల మద్దతుతో రూపొందించిన ఈ స్ట్రాబెర్రీఫ్లేవర్ గమ్మీస్ నిజంగా గేమ్ ఛేంజర్. రోజుకు రెండు గమ్మీస్ తీసుకోవడం ద్వారా, రెండు గిన్నెల పాలకూరలో ఉండేంత ఐరన్ లభిస్తుంది**, ఇది అలసట మరియు జుట్టు రాలడం వంటి ఐరన్ లోప లక్షణాలను అధిగమించడంలో సహాయపడుతుంది," అని పీ & జీ హెల్త్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కుమార్ పాంపనా అన్నారు.

# సిబిల్ స్కోరు తక్కువైతే రుణం రావడం లేదా?

జీవితంలో ఒక వ్యక్తికి వెంటనే డబ్బు అవసరమైన సందర్భాలు చాలా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో వారు అత్యవసర నిధిని ఆదా చేసుకుంటే వారి పరిస్థితి సులభం అవుతుంది. అయితే చాలా మందికి అలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి అత్యవసర నిధి ఉండదు.అటువంటి పరిస్థితిలో బ్యాంకు నుండి రుణం తీసుకోవడం తప్ప వేరే మార్గం లేదు. రుణం మంజూరు చేసే ముందు బ్యాంకులు ఒక వ్యక్తి ఆర్థిక సమాచారం, ఇతర అంశాలను పరిశీలిస్తాయి. బ్యాంకులు ప్రధానంగా ఒక వ్యక్తి సిబిల్ స్కోరు గురించి సమాచారం కోసం చూస్తాయి. సిబిల్ స్కోరు తక్కువగా ఉంటే బ్యాంకులు రుణం మంజూరు చేయడానికి నిరాకరించవచ్చు. సిబిల్ స్కోరు తక్కువగా ఉంటే ఒక వ్యక్తి రుణం పొందవచ్చా? సిబిల్ స్కోరు తక్కువగా ఉన్న బ్యాంకు నుండి మీరు ఎలా రుణం పొందవచ్చో తెలుసుకుందాం.




**మీ సిబిల్ స్కోరు చెడ్డగా ఉంటే మీరు ఈ విధంగా రుణం పొందవచ్చు:**

మీ సిబిల్ స్కోరు పేలవంగా ఉండి, మీ బ్యాంకు మీకు రుణం నిరాకరించినట్లయితే, భయపడాల్సిన అవసరం లేదు. అలాంటి సమయాల్లో మీ బ్యాంకు ఎఫ్‌డీ మీకు మద్దతుగా ఉంటుంది. చాలా సందర్భాలలో తక్కువ సిబిల్ స్కోర్‌లతో కూడా బ్యాంకులు ఎఫ్‌డీలపై రుణాలను ఆమోదిస్తాయి. అయితే రుణ మొత్తం మీ ఎఫ్‌డీ బ్యాలెన్స్‌పై ఆధారపడి ఉంటుంది.

ఎఫ్‌డీపై రుణం అనేది ఒక రకమైన సెక్యూర్డ్ రుణం. బ్యాంకులు మీ క్రెడిట్ చరిత్రను పరిశీలించవు. ఎందుకంటే మీ ఎఫ్‌డీ మీ రుణానికి ఏకైక పూచీకత్తు. ఏదైనా కారణం చేత మీరు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే బ్యాంకు మీ ఎఫ్‌డీ నుండి రుణ మొత్తాన్ని తీసుకుంటుంది. అందువల్ల సిబిల్ స్కోరు తక్కువగా ఉన్నవారికి ఎఫ్‌డీపై రుణం తీసుకోవడం సులభమైన, నమ్మదగిన ఎంపిక కావచ్చు

**మీ సిబిల్ స్కోరు ఈ విధంగా మెరుగుపడుతుంది:**

ఎఫ్‌డీ మొత్తంలో 90% వరకు రుణం తీసుకోవచ్చు. అంటే మీ ఎఫ్‌డీ విలువ రూ.1 లక్ష అయితే మీరు రూ.90,000 వరకు రుణం తీసుకోవచ్చు. మీరు మీ ఎఫ్‌డీ లోన్ మొత్తాన్ని సకాలంలో తిరిగి చెల్లిస్తే మీ సిబిల్ స్కోరు మెరుగుపడుతుంది. మీ ఎఫ్‌డీ లోన్ మొత్తాన్ని తిరిగి చెల్లించడం ద్వారా మీరు మీ సిబిల్ స్కోరును 100 పాయింట్ల వరకు మెరుగుపరచుకోవచ్చు

# కోమకి కొత్త ఎంఎక్స్16 ప్రో లాంచ్..

ప్రముఖ విద్యుత్ వాహన బ్రాండ్ అయిన కోమకి ఎలక్ట్రిక్, ఆకర్షణీయమైన డిజైన్, అధునాతన ఈవీ ఇంజనీరింగ్‌తో సవారీని పునర్నిర్వచించడానికి MX16 ప్రోను విడుదల చేసింది. రీన్‌ఫోర్స్డ్ మెటల్ బాడీ క్రూయిజర్ బైక్ రూ. 1,69,999/ధరకు అందుబాటులో ఉంది, ఇది ప్రతి సవారీ లో బలం మరియు సౌకర్యాన్ని అందించడం ద్వారా రోడ్డుపై అసాధారణమైన కమాండ్‌ను ప్రదర్శిస్తుంది. ఇది సాటిలేని మన్నిక, ప్రభావ నిరోధకత మరియు దీర్ఘకాలిక విశ్వసనీయతను ప్రతిబింబిస్తుంది, ప్రతి రైడ్‌లో దృఢమైన మరియు వారసత్వ అనుభవాన్ని అందిస్తుంది. డ్యూయల్ టోన్ మరియు జెట్ బ్లాక్ అనే రెండు రంగులలో లభిస్తుంది, ఇది చూడగానే ఆకట్టుకునేరీతిలో ఉండటం తో పాటుగా వాహనం యొక్క సౌందర్యాన్ని మెరుగుపరుస్తుంది.

మార్కెట్‌లోని ఇతర ఎలక్ట్రిక్ క్రూయిజర్‌ల ధరలో దాదాపు సగం ధరలో వస్తున్న ఈ వాహనం పనితీరు మరియు ఫీచర్ల పరంగా రాజీపడదు. సాటిలేని పనితీరు, సౌకర్యం, పరిధికి హామీ ఇవ్వడం ద్వారా ప్రతి ప్రయాణాన్ని మరపురానిదిగా చేయడానికి ఈ వాహనం రూపొందించబడింది. ఈ బైక్ 5 kW BLDC హబ్ మోటర్ మరియు 4.5 kWh బ్యాటరీతో పనిచేస్తుంది, ఇది ఒక్కసారి ఛార్జ్ చేస్తే 160220 కి.మీ.ల రేంజ్ ని అందిస్తుంది. MX16 ప్రో ను రూ.1520 తో ఛార్జ్ చేస్తే 200 కి.మీ.ల రేంజ్ ని అందిస్తుంది, అయితే సాంప్రదాయ పెట్రోల్ ద్విచక్ర వాహనంపై అదే దూరాన్ని కవర్ చేయడానికి దాదాపు రూ.700 ఖర్చవుతుంది. ఇది



MX16 ప్రోను పెట్రోల్ బైక్‌ల కంటే దాదాపు 5 రెట్లు ఎక్కువ పొదుపుగా చేస్తుంది. దీనితో పాటు, 5 kW (6.7 hp) అధికటార్క్ మోటర్ శక్తివంతమైన క్రూజింగ్ పనితీరును సులభతరం చేస్తుంది. 80kph గరిష్ట వేగాన్ని సాధించడం ద్వారా, ఈ బైక్ అన్ని భూభాగాలను సజావుగా మరియు స్థిరమైన హ్యాండ్లింగ్‌తో నడపడానికి అనువైనది.

ఈ ఎలక్ట్రిక్ క్రూయిజర్ బైక్ ప్రతి రైడ్‌లో ఎలాంటి ఇబ్బంది లేని బ్రేకింగ్ నియంత్రణ, స్థిరత్వం మరియు భద్రతను సాధించడానికి ప్రత్యేక ట్రిపుల్ డిస్క్ బ్రేక్ సిస్టమ్‌తో అమర్చబడి ఉంది. మృదువైన టార్క్, వెడల్పాటి సీటింగ్ మరియు తక్కువ వైబ్రేషన్ డిజైన్ యొక్క ప్రయోజనంతో వస్తున్న ఈ వాహనం రైడ్‌ను సహజంగా మరియు సౌకర్యవంతంగా చేస్తుంది. అదే సమయంలో, MX16 ప్రో దాని శైలితో రోడ్డుపై ఒక ప్రకటనను సృష్టిస్తుంది, ఇక్కడ విస్తరించిన ఫ్రేమ్, ప్రీమియం డిటెయిలింగ్ మరియు కంఫర్ట్‌ఫోకస్డ్ డిజైన్ చూపరుల దృష్టిని ఆకర్షించడం ఖాయం.

అదనంగా, డ్యూయల్ డిస్క్ బ్రేక్‌లు మరియు సర్దుబాటు చేయగల సస్పెన్షన్ వాహనంపై మెరుగైన నియంత్రణను అందిస్తాయి. అదే సమయంలో, ఇది ఫుల్ కలర్ టి ఎఫ్ టి డిస్ప్లే, బ్లూటూత్ కనెక్టివిటీ, క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ అసిస్ట్, రీజెనరేటివ్ బ్రేకింగ్, ఆటో రిపేర్ స్విచ్ మరియు పార్క్ అసిస్ట్ వంటి అధునాతన ఫీచర్లను సైతం కలిగివుంటుంది , ఇది స్మార్ట్ మరియు సున్నితమైన క్రూజింగ్‌ను అనుమతిస్తుంది.

ఈ సందర్భంగా కోమకి ఎలక్ట్రిక్ వెహికల్స్ సహ వ్యవస్థాపకుడు గుంజన్ మల్హోత్రా మాట్లాడుతూ, "MX16 ప్రో విడుదల ను ఈవీ విభాగంలో గేమ్ ఛేంజర్‌గా పరిగణించవచ్చు. వారాంతపు విశ్రాంతి డ్రైవ్‌ల నుండి రోజువారీ స్పిన్‌ల వరకు ప్రతి రైడ్‌ను ఆనందదాయకమైన అనుభవంగా మార్చడానికి శక్తివంతమైన పనితీరు, అత్యాధునిక సాంకేతికత మరియు సాటిలేని సౌకర్యాన్ని మిళితం చేసే ఉద్దేశ్యంతో దీనిని ప్రధానంగా ప్రవేశపెట్టారు.

# ఎస్‌బీఐ కస్టమర్లకు బిగ్ అలర్ట్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ). తన కస్టమర్లకు ఒక ముఖ్యమైన ప్రకటన చేసింది. డిజిటల్ చెల్లింపుల విభాగంలో అందిస్తున్న ఎం క్యాష్ సర్వీసును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. నవంబర్ 30వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి




ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు వివరించింది. ప్రస్తుతం ఈ ఎం క్యాష్ సేవలు.. ఎస్‌బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో లైట్ యాప్‌లలో అందుబాటులో ఉంది. దీని ద్వారా లబ్ధిదారుడి బ్యాంక్ ఖాను ముందుగా నమోదు చేయకుండానే.. కస్టమర్లు కేవలం వారి మొబైల్ నెంబర్ లేదా ఈ మెయిల్ ఐడీ ద్వారా నగదు పంపడం లేదా స్వీకరించడం చేసేవారు. అయితే నవంబర్ 30వ తేదీ వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉండనుందని ఎస్‌బీఐ వెల్లడించింది.ఎం క్యాష్ సేవలు నిలిచిపోనున్న నేపథ్యంలో నగదు బదిలీ కోసం సురక్షితమైన డిజిటల్ పద్ధతులను వినియోగించుకోవాలని తమ బ్యాంక్ కస్టమర్లకు ఎస్‌బీఐ సూచించింది. అందుకు ప్రత్యామ్నాయ మార్గాలుగా .. యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయని కస్టమర్లకు ఎస్‌బీఐ సోదాహరణగా వివరించింది.ఇక ఎం క్యాష్ లాగానే యూపీఐ ద్వారా నగదు పంపడానికి లబ్ధిదారుడిని ముందుగా రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం లేదు. భీమ్, ఎస్‌బీఐ పే, యోనో యాప్‌ల ద్వారా మొబైల్ నెంబర్ లేదా ఖాతా వివరాలతో సులభంగా నగదు లావాదేవీలు జరపవచ్చు. మరోవైపు ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవలు యాథాతథంగా పని చేస్తాయని ఎస్‌బీఐ వివరించింది.

# శాంసన్ నిజాయతీపరుడు..
## రాజస్థాన్‌ను ఎందుకు వీడాడంటే..?

ఐపీఎల్‌లో బిగ్గెస్ట్ ట్రేడ్‌డీల్‌లో సంజూ శాంసన్ ను చెన్నై సూపర్ కింగ్స్ దక్కించుకుంది. ఏడేళ్లుగా రాజస్థాన్ రాయల్స్‌తో కొనసాగిన సంజూ ఇప్పుడు చెన్నై జెర్సీతో మైదానంలోకి దిగనున్నాడు. సంజూ రాజస్థాన్‌కు గుడ్ బై చెప్పడానికి కారణాలు లేకపోలేదు. కొన్ని సీజన్లుగా జట్టు ప్రదర్శన ఆశించినతంగా లేకపోవడంతో నిరాశచెందిన శాంసన్.. కొత్త ఫ్రాంచైజీకి ఆడేందుకు నిర్ణయించుకున్నాడు. తమ జట్టుకు పద్నాలుగేళ్లు ఆడిన శాంసన్‌ను వదిలేయడంపై రాజస్థాన్ యజమాని మనోజ్ బడలే ఏం చెప్పాడంటే ..?'ఈ ఏడాది.. అంతకంటే ముందు నుంచి కూడా శాంసన్ తాను జట్టు మారాలని అనుకుంటున్నట్టు చెప్పాడు. అతడలా మాతో చెప్పగానే అందరం షాకయ్యాం. టీమ్ మేనేజ్‌మెంట్ సమావేశమై చర్చించాం. సంజూ చాలా నిజాయతీపరుడు. కానీ, అతడు వ్యక్తిగతంగా డల్‌గా కనిపించాడు. రాజస్థాన్ ఫ్రాంచైజీ అంటే అతడికి చాలా ఇష్టం, గౌరవం. గత పద్దెనిమిది సీజనల్లో ఒకస్కారి కూడా విజేతగా నిలవకపోవడం కూడా సంజూలో మార్పు తెచ్చింది. పద్నాలుగేళ్లు అతడు రాజస్థాన్‌కు విశేష సేవలందించాడు. ఐపీఎల్‌లో అతడు కొత్త జర్నీ చేయాలనుకుంటున్నాడు. ఇన్నాళ్లు రాజస్థాన్ అభిమానులు అతడి ఆటలను, సిక్సర్లును ఎంతో ఎంజాయ్ చేశారు' అని తెలిపాడు.2021లో కెప్టెన్సీ తొలిసారి 2013లో రాజస్థాన్‌కు ఆడిన శాంసన్ 2015 తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లాడు. అక్కడ మూడు సీజన్లు ఆడిన అతడు మళ్లీ 2018లో రాజస్థాన్ గూటికి చేరాడు. 2021లో కెప్టెన్సీ చేపట్టిన సంజూ మరసటి ఏడాదే జట్టును ఫైనల్ చేర్చాడు. కానీ, టైటిల్ పోరులో గుజరాత్ టైటాన్స్ విజేతగా నిలిచింది. పద్దెనిమిదో సీజన్‌లో గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన అతడు.. తిరిగి వచ్చేసరికి ప్లే ఆఫ్స్ రేసులో రాజస్థాన్ లేదు. పైగా రియాన్ పరాగ్ సారథిగా రాణించడం, యశస్వీకి జతగా వైభవ్ సూర్యవంశీ రూపంలో డేంజరస్ ఓపెనర్ దొరకడంతో సంజూ జట్టు మారడమే శరణ్యం అనుకున్నాడు. ఐపీఎల్ 18వ సీజన్ ముగియగానే అతడు సీఎస్కేకు అనుకూలంగా పోస్ట్‌లు పెట్టాడు. దాంతో.. వచ్చే ఏడాది సంజూ చెన్నైకి ఆడడం ఖాయమనుకున్నారంతా. అనుకున్నట్టే ట్రేడ్ డీల్ ద్వారా చెన్నై అతడిని కొనేసింది.



# మా ఓటమికి కారణం అదే పంత్

స్వదేశంలో దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను భారత్ ఓటమి ప్రారంభించింది. కోల్ కతా వేదికగా ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన తొలి టెస్టులో ప్రొటీస్ చేతిలో 30 పరుగుల తేడాతో టీమిండియా పరాజయం పాలైంది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో బవుమా బృందం 10తో ఆధిక్యంలోకి వెళ్లగా.. గువాహటి వేదికగా రెండో టెస్టులో తప్పక గెలవాల్సిన పరిస్థితిలో భారత్ నిలిచింది. మరోవైపు తొలి టెస్టు ఓటమి నేపథ్యంలో భారత జట్టు తాత్కాలిక కెప్టెన్ రిషభ్ పంత్ స్పందించాడు. ఒత్తిడిలో తాము చిత్తయ్యామని పేర్కొన్నాడు. ఇంకాస్త మెరుగ్గా ఆడి ఉంటే టార్గెట్ ను ఛేదించేవాళ్లమని తమ ఫెయిల్యూర్ ను పంత్ అంగీకరించాడు.మ్యాచ్ అనంతరం రిషభ్ పంత్ మీడియాతో మాట్లాడుతూ... '124 పరుగుల లక్ష్యాన్ని మేము ఛేదించి ఉండాల్సింది. టార్గెట్ చిన్నదే అయినా... రెండో ఇన్నింగ్స్‌లో మాపై ఒత్తిడి బాగా పెరిగింది. దాన్ని మేము అధిగమించ లేకపోయాము. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా, బాష్.. అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. వారిద్దరు.. తమ భాగస్వామ్యంతో మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పుకున్నారు. ఇలాంటి పిచ్‌పై 120 పరుగులు చేయడం అంత ఈజీ కాదు.




అయితే, మేము మాత్రం ఈ విషయంలో విఫలమయ్యాము. ఈ మ్యాచ్ ఫలితాన్ని విశ్లేషించిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటాం. తిరిగి పుంజుకుంటామనే నమ్మకం ఉంది' అని పంత్ వెల్లడించాడు. మెడనొప్పి వల్ల తొలి ఇన్నింగ్స్ మధ్యలోనే నిష్క్రమించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మళ్లీ బ్యాటింగ్‌కు రాలేదు. అతడి స్థానంలో వైస్ కెప్టెన్ పంత్.. తాత్కాలిక సారథిగా వ్యవహరించాడు.

# క్యురేటర్‌కు మద్దతుగా నిలిచిన గంగూలీ

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టు మ్యాచులో టీమిండియా ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక 93 పరుగులకే ఆలౌటైంది. దీంతో 30 పరుగుల తేడాతో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో ఇరు జట్ల బౌలర్లు ఓ రేంజ్ లో బ్యాటర్లపై విరుచకుపడ్డారు. బాల్ ను టచ్ చేయడానికి బ్యాటర్లు భయపడ్డారు అంటే... ఏ రేంజ్ లో పిచ్ మార్పు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ మ్యాచ్ లో ఎవ్వరూ ఊహించని విధంగా పిచ్ బౌలర్లకు అనుకూలంగా మారింది. కోల్‌కతా టెస్టులో పరుగులు చేయడానికి బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన.. ఈ పిచ్ పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించాడు. ఈ విషయంలో అతడు క్యురేటర్ సుజన్ ముఖర్జీకి మద్దతుగా నిలిచాడు. టీమిండియా మేనేజ్మెంట్ కోరిక మేరకే పిచ్‌ను రూపొందించినట్లు వివరించాడు. భారత శిబిరం ఎలాంటి పిచ్‌ను కోరుకుందో అలాంటిదే రూపొందించామని తెలిపాడు. పిచ్‌పై మ్యాచ్‌కు ముందు నాలుగు రోజులుగా నీళ్లు అప్లయ్ చేయలేదని, అందుకే అది ఇలా స్పందిస్తోందని, ఈ



విషయంలో క్యురేటర్ ముఖర్జీని తప్పుపట్టలేమని దాదా స్పష్టం చేశాడు ఈ తొలి టెస్టు మ్యాచ్‌లో ఇప్పటి వరకు ఇరు జట్లలో ఏ ఒక్కటి కూడా రెండు వందల పరుగుల మార్క్ దాటలేదు. బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా ఒక్కడే (55*; 136 బంతులు) రెండో ఇన్నింగ్స్‌లో ఈ పిచ్‌పై పరుగులు చేయగలిగాడు. అందరూ అనుకున్నట్లే మూడు రోజుల్లోనే ఈ టెస్టు మ్యాచ్ ముగిసింది. ఈ నేపథ్యంలో పలువురు మాజీలు ఈడెన్ గార్డెన్స్ పిచ్ పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఐసీసీ నుంచి సైతం నాసిరకం (పూర్) రేటింగ్, డిమెరిట్ పాయింట్లు వచ్చే ప్రమాదముందని క్రికెట్ అభిమానులు వాపోతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సినిమా-రాజకీయాలు వేరు ప్రపంచాలు

- మనోరమా న్యూస్ న్యూస్మేకర్ అవార్డులో ఉపరాష్ట్రపతి సందేశం
- దేశ అభివృద్ధి సానుకూలతను యువతకు చేరవేయడంలో మీడియా పాత్ర కీలకం
- డ్రగ్ ఫ్రీ సొసైటీ నిర్మాణంలో జర్నలిజం ప్రభావం అత్యంత ముఖ్యమని హితవు



మనోరమా న్యూస్ న్యూస్మేకర్ అవార్డు 2024 కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర పర్యాటక, పెట్రోలియం & నేచురల్ గ్యాస్ శాఖ మంత్రిగా ఉన్న సురేష్ గోపికి అవార్డును ప్రదానం చేశారు. సినిమా రంగం, రాజకీయ రంగం రెండు వేర్వేరు ప్రపంచాలు అయినప్పటికీ రెండింటిలోనూ అనిశ్చితి ఒకేలా ఉంటుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ రెండింటిలో కూడా విజయవంతంగా నిలిచిన సురేష్ గోపిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకలో మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి మీడియా బాధ్యతను వివరించారు. దేశంలో జరుగుతున్న సానుకూల పరిణామాలను యువతకు చేర్చడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని, నిరుత్సాహం కాకుండా ఆశజనకతను పెంచే జర్నలిజం అవసరమని స్పష్టం చేశారు. వాణిజ్యం, అభివృద్ధి, ఆవిష్కరణ, పౌర సేవలు ఇవన్నీ ప్రజలకు సమయానుకూలంగా చేరేలా చేయడంలో మీడియా ధర్మబద్ధంగా వ్యవహరించాలి అని సూచించారు.



అంతేకాకుండా జర్నలిజం "విలువలు లేని వారికి స్వరం ఇచ్చే వేదిక"గా వ్యవహరించాలి అని ఉపరాష్ట్రపతి అన్నారు. ముఖ్యంగా డ్రగ్ మాఫియా వ్యాప్తి, యువతలో పెరుగుతున్న వ్యసన సమస్యలను అరికట్టడానికి మీడియా ముందుండాలని, అవగాహనను సృష్టించడమే అసలైన సామాజిక సేవ అని ఆయన వివరించారు. యువత భవిష్యత్తు దెబ్బతినకుండా సమాజం మొత్తం కలసి పని చేయాలని పిలుపునిచ్చారు.

మనోరమా గ్రూప్ గురించి ప్రశంసిస్తూ, దశాబ్దాలుగా భాష, సంస్కృతి, సత్యనిష్ఠతో కోట్లాది పాఠకుల అచ్చొత్త విశ్వాసాన్ని పొందిన సంస్థగా అభివర్ణించారు. మలయాళ సాహిత్య అభివృద్ధి, వార్తా ప్రమాణాలు, సామాజిక అవగాహనలో గ్రూప్ చేసిన సేవలు ప్రశంసనీయం అని తెలిపారు. ప్రజలు నమ్మే వార్తా సంస్థగా మనోరమా నిలబడటం దేశ మీడియా ప్రపంచానికి గర్వకారణమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే రాష్ట్రం అగ్నిగుండంల మారుతుంది: శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

- కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని మాజీ మంత్రి విమర్శ
- బీసీలకు 42% రిజర్వేషన్ తప్పనిసరి అని స్పష్టం
- బీజేపీ–కాంగ్రెస్ ఇద్దరూ బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, ( తెలంగాణ ముచ్చట్లు):



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇంకా అమలు చేయకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అక్కడ అభివృద్ధి కనిపించకపోవడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని చెప్పారు. కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకూ సమాన న్యాయం జరిగిందని గుర్తుచేస్తూ, బీసీ వర్గాల అభ్యున్నతి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రాముఖ్యత అని వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండానే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని చూస్తే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందని గౌడ్ హెచ్చరించారు. బీసీలు ఈసారి మోసపోవరు, న్యాయం చేసే వరకు ఉద్యమిస్తారని ఆయన అన్నారు. రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని తీవ్రంగా విమర్శించారు. బీసీ సమాజం గర్వకారణమయ్యే ఈ డిమాండ్‌ను ఎవ్వరూ అడ్డుకోలేరని అన్నారు. కాంగ్రెస్ మాత్రమే కాదు, బీజేపీ కూడా బీసీ వర్గాలను మోసం చేస్తోందని గౌడ్ ఆరోపించారు. బీసీ బిల్లు పాస్ అవ్వాలంటే ప్రధాని, రాష్ట్రపతిని కలవాల్సిన అవసరం ఉందని గుర్తు చేస్తూ, బీజేపీ నేతలు దీనిపై మౌనం పాటించడం సిగ్గుచేటు అన్నారు. బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో ఒత్తిడి తీసుకురాకపోవడంతో బీసీ బిల్లుకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. న్యాయం చేయని పార్టీలకు బీసీ వర్గాలు గట్టి గుణపాఠం చెప్తాయని హెచ్చరించారు.

బీఆర్ఎస్ బీసీ రిజర్వేషన్ల విషయంలో పూర్తిగా కట్టుబడి ఉందని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక-సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయడమే రాష్ట్రాభివృద్ధికి దారి తీస్తుందని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున బీసీ దిక్సూచీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# హైదరాబాద్ ఫ్లైఓవర్ నిర్మాణాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కీలక భేటీ

- అలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పాటిల్, ఈటెల రాజేందర్ కలిసి వినతులు
- హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలపై కేంద్ర స్థాయి దృష్టి అవసరమని అభ్యర్థన
- ఉప్పల్–కొంపల్లి ఫ్లైఓవర్ పనులకు వేగం పెంచుతామని నితిన్ గడ్కరీ హామీ



మహారాష్ట్రలోని నాగపూర్‌లో రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఆలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్‌తో పాటు ఈటెల రాజేందర్ కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్‌లు, పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, వాటి పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర సమన్వయం పెంచాల్సిన అవసరంపై నేతలు మంత్రి తో విస్తృతంగా చర్చించారు.

హైదరాబాద్‌కు కోట్లలో జనాభా, రోజూ మరో అరకోటికి పైగా ప్రజలు వచ్చి వెళ్లే పరిస్థితిలో రద్దీ తీవ్రత పెరుగుతున్నదని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫీసు సమయాల్లో ట్రాఫిక్ జామ్‌లు ప్రజల పని తీరునే దెబ్బతీస్తున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు తగినంతగా అభివృద్ధి చెందకపోవడం వల్ల ఇబ్బందులు అధికమయ్యాయని వివరించారు. ఉప్పల్ ఫ్లైఓవర్, కొంపల్లి ఫ్లైఓవర్ వంటి ముఖ్య ప్రాజెక్టులు నత్తనడకన సాగడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు.

ఈటెల రాజేందర్ సహా నాయకులు కలసి, వరంగల్ హైవేలో ఉన్న ఉప్పల్ ఫ్లైఓవర్ మరియు నిజామాబాద్ హైవేలోని కొంపల్లి ఫ్లైఓవర్ పనులను అత్యవసరంగా వేగవంతం చేయాలని నితిన్ గడ్కరీ ని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రాజెక్టుల డెడ్‌లైన్లు ఎన్నోసార్లు దాటిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలని నేతలు కోరినట్లు సమాచారం.

బాలానగర్ నరసాపూర్ హైవేలో వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో కొత్త ఫ్లైఓవర్ అవసరం ఉందని నాయకులు సూచించారు. అలాగే నాగార్జునసాగర్ క్రాస్ రోడ్ నుండి అమరావతి వరకు నిర్మాణంలో ఉన్న కొత్త హైవేపై భవిష్యత్తులో రద్దీ మరింత పెరుగవచ్చని, అందువల్ల సాగర్ ఎక్స్ రోడ్ వైపు కూడా ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందించారు. దీనిపై మంత్రి అంగీకారం తెలుపుతూ త్వరలో నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు.

# వీరాంగణ ఊదా దేవి బలిదాన దినోత్సవంలో ఘన నివాళులు

- నారీశక్తి శౌర్యాన్ని గుర్తు చేసే అమర స్వాతంత్ర్య సేనాని
- ఊదా దేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర నేతలు
- వంచిత వర్గాల అభ్యున్నతి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం




దేశ తొలి స్వాతంత్ర్య సమరంలో అచంచల ధైర్యంతో పోరాడిన అమర వీరాంగణ ఊదా దేవి బలిదానాన్ని స్మరించేందుకు లక్నోలో ఘన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌తో కలిసి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. నారీశక్తి ఎప్పటినుంచో సామర్థ్యానికి ప్రతీక అని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు పోషించిన పాత్ర చిరస్మరణీయమని నాయకులు గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఊదా దేవి విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆమెకు వినమ్ర నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఒక మహిళ శౌర్యం బ్రిటిష్ పాలకులను ఎదుర్కొంటూ దేశం కోసం ప్రాణాలు అర్పించగలదని చరిత్ర చెబుతుందని సభలో ప్రసంగించిన నేతలు అన్నారు. ఆమె త్యాగం భారతీయ మహిళల సాహసానికి చిరస్థాయిగా నిలిచే చిహ్నమని పేర్కొన్నారు.



స్వాభిమానం, సమాజ పురోగతి, వంచిత వర్గాల అభ్యున్నతి ఇవే ద్విచక్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన సంకల్పాలని నాయకులు వెల్లడించారు. మహిళా శక్తిని గౌరవించడం, వారి విద్య, ఉపాధి, భద్రత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇలాంటి స్వాతంత్ర్య సైనికుల కథలు యువతలో దేశభక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఊదా దేవి బలిదానం దేశ చరిత్రలో వెలిగే అక్షరాలు. ఆమె ధైర్యం, సంకల్పం, త్యాగం నేటి తరానికి ప్రేరణగా నిలుస్తోంది. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరాంగణల కలలు నిజం కావాలంటే మహిళల పురోగతికి ప్రతి వర్గం సమిష్టిగా కృషి చేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

# కార్తీక వనసమారాధనల ద్వారా సామాజిక ఐక్యత బలపడాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- సత్తుపల్లి–కొత్తగూడెం ప్రాంతాల్లో పలు వనభోజనాలకు ప్రధాన అతిథిగా హాజరు
- ఆధ్యాత్మికత మన సంస్కృతికి ప్రాణం, కుటుంబ బంధాలకు దృఢత
- అన్ని వర్గాల సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని సందేశం

ఖమ్మం, నవంబర్ 16( తెలంగాణ ముచ్చట్లు):




పవిత్ర కార్తీకమాసం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన పలు వనసమారాధన కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఆశీర్వదించారు. ఆధ్యాత్మిక నీడలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పరమశివుడిని ప్రార్థించిన ఆయన, సామాజిక ఐక్యతే ఏ ప్రాంతానికైనా అభివృద్ధికి మూలమని సందేశం ఇచ్చారు.

సత్తుపల్లి పట్టణంలోని గౌరీగూడెంలో రెడ్డి సమాజం నిర్వహించిన కార్తీకమాస వనసమారాధనతో కార్యక్రమాలు ప్రారంభమైనాయి. అనంతరం సత్తుపల్లి ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన వనసమారాధనలో పాల్గొన్న పొంగులేటి, పెద్దలు యువతతో సత్సంగం నిర్వహించారు. తరువాత కొత్తగూడెం రైటర్ బస్తీలో ఆర్యవైశ్య సంగం నిర్వహించిన వనభోజనంలో పాల్గొని వారికి కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు.


తరువాత లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురంలోని మామిడి తోటలో జరిగిన రెడ్డి సంఘం వనసమారాధనలో పాల్గొన్న ఆయన, ప్రజలతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. వనసమారాధనలు కేవలం పండుగ కార్యక్రమాలు మాత్రమే కాకుండా, కుటుంబ బంధాలను, సామాజిక అనురాగాన్ని బలపరచే విలువైన సందర్భాలని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

కార్తీకమాస వనసమారాధనలు మన సంస్కృతి, సంప్రదాయం, ఆచారాలకు ప్రతీకలని, ఇలా అన్ని వర్గాలు కలిసి పాల్గొనే కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. ప్రజల సమిష్టి కృషి, పరస్పర సహకారం ఉన్నప్పుడే ఒక ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఎలక్ట్రిక్ కారు కాలిబూడిద

- పార్కింగ్‌లో నిలిపిన కారులో అకస్మాత్తుగా మంటలు
- మరో కారు పాక్షికంగా దెబ్బతినడంతో కలకలం
- అగ్నిమాపక సిబ్బంది అరగంట శ్రమించి మంటలను అదుపు

హైదరాబాద్, ( తెలంగాణ ముచ్చట్లు):



నగరంలోని నారాయణగూడ ప్రాంతం ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కలకలం రేగింది. ఎన్టీఆర్ స్టేడియం వద్ద పార్కింగ్‌లో ఉన్న ఓ ఎలక్ట్రిక్ కారు అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. మంటలు బీకరంగా వ్యాపించి కారు పూర్తిగా కాలిపోయింది. మంటల తీవ్రత కారణంగా పక్కనే నిలిపిన మరో కారు పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో అలర్ట్ అయిన అధికారులు స్థలానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. వేడి దెబ్బకు కారులోని బ్యాటరీ భాగాలు పూర్తిగా పగిలిపోయి అగ్ని వేగంగా వ్యాపించినట్లు ఫైర్ అధికారుల ప్రాథమిక అంచనా. మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడడంతో స్టేడియం చుట్టుపక్కల ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాంధీనగర్, దోమలగూడ పోలీసు సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్ మార్గాన్ని సర్దుబాటు చేసి, వాహనాలను ఇతర దారుల వైపు మళ్లించారు. సమయంలో ఎవరూ కారులో లేకపోవడం పెద్ద ప్రమాదాన్ని తప్పించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. అయితే ఎలక్ట్రిక్ వాహనాల్లో ఇలాంటి అగ్నిప్రమాదాలు జరగడం వాహనదారుల్లో ఆందోళనను పెంచుతున్నాయి. పార్కింగ్ ప్రాంతాల్లో కూడా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం భద్రతా ప్రమాణాలను పునర్విమర్శించాల్సిన అవసరాన్ని అధికార వర్గాలు గుర్తిస్తున్నాయి. అగ్ని ప్రమాదానికి గల నిజమైన కారణాన్ని నిర్ధారించేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇది సాంకేతిక లోపమా, షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా లేదా వాహనం బ్యాటరీ వ్యవస్థలో ఏదైనా లోపం వచ్చిందా అనే కోణాల్లో ఫోరెన్సిక్ బృందం పరిశీలన ప్రారంభించింది. పూర్తి వివరాలు ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చిన తర్వాత తెలియనున్నాయని ఒక సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న ఈ తరుణంలో ఇలాంటి ఘటనలు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in